ఉష్ణోగ్రత శనివారం గరిష్ఠం : 29.0 కనిష్ఠం : 20.0

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



అనంతపురం

జిల్లా వార్తలు

ఆదివారం 30 నవంబరు 2025

రేపు పీజీఆర్ఎస్

అనంతపురం కలెక్టరేట్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి ప్రజా ఫిర్యాదుల సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఆనంద్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు నిర్వహిస్తామన్నారు. మీ కోసం కాల్ సెంటర్ 1100సేవలను వినియోగించుకోవాలన్నారు. అర్జీదారులు గతంలో ఇచ్చిన అర్జీకి సంబంధించిన స్లిప్పును తీసుకురావాలని సూచించారు.

మంత్రి ఇచ్చిన మాట..!

అధికారులది నిర్లక్ష్యపు బాట

కదలిక లేని చీనీ ప్రాసెసింగ్ యూనిట్

యువగళం 800 కి.మీ. మైలురాయి వద్ద లోకేశ్ హామీ

మర్తాడులో శిలాఫలకం ఆవిష్కరణ

వేరేచోట స్థల పరిశీలనపై

మర్తాడు రైతుల అభ్యంతరం



మర్తాడులో 800 కిలో మీటర్ల మైలురాయి శిలాఫలాన్ని ఆవిష్కరిస్తున్న నారాలోకేశ్ (ఫైల్)



అనంతపురం అర్బన్/గార్లదిన్నె, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): చీనీ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. యువగళం పాదయాత్రలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఇచ్చిన హామీ ఇది. యువగళం పాదయాత్ర గార్లదిన్నె మండలం మర్తాడు గ్రామంలో 800 కి.మీ. మైలురాయిని పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా టీడీపీ అధికారంలోకి రాగానే గార్లదిన్నె మండలంలో చీనీ ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేస్తామని అప్పట్లో నారా లోకేశ్ హామీ ఇచ్చారు. ఈ హామీకి గుర్తుగా మర్తాడులో శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ప్రజల మద్దతుతో టీడీపీ కూటమి అఖండ మెజార్టీతో విజయం సాధించింది. ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత ఇచ్చిన హామీ అమలు దిశగా మంత్రి నారా లోకేశ్ చర్యలు చేపట్టారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో గార్లదిన్నె మండలం కనుంపల్లి, జంబులదిన్నె కొట్టాల ప్రాంతాల్లో రెండు చోట్ల చీనీ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు కోసం స్థలాలను (పొలాలను) ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ అధికారులు పరిశీలించారు. ఆ తర్వాత దాని ఊసే మరచిపోయారు.

రూ.3.5 కోట్లతో..

మంత్రి లోకేశ్ ఇచ్చిన హామీ మేరకు రూ.3.50 కోట్ల వ్యయంతో మూడెకరాలకు పైగా విస్తీర్ణంలో ప్రైమరీ చీనీ ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. కానీ అంత కంటే ఎక్కువ విస్తీర్ణంలో ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తే బాగుంటుందని చీనీ రైతులు అభిప్రాయపడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 40 వేల హెక్టార్లల్లో చీనీ పంట సాగవుతోంది. జిల్లాలో పండించిన చీనీకి గిరాకీ బాగుంటుంది. ఈ క్రమంలో వ్యాపారులు తోటల వద్దకే వెళ్లి చీనీ పంటను కొనుగోలు

(మిగతా 6లో...)

కసాపురంలో మన్యుసూక్త హోమం



హోమం నిర్వహిస్తున్న వేదపండితులు, అర్చకులు

గుంతకల్లుటౌన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవాలయంలో శనివారం మన్యుసూక్త హోమం నిర్వహించారు. పూర్వాభాద్ర తిరునక్షత్రాన్ని పురస్కరించుకుని ఆలయంలోని యాగశాలలో ఆంజనేయస్వామి ఉత్సవ మూర్తిని కొలువుదీర్చారు. ఉత్సవమూర్తికి తిరుమంజన స్నపన, మన్యు సూక్త హోమం నిర్వహించారు. అనంతరం రాత్రి స్వామిని వెండి రథంలో కొలువుదీర్చి ఆలయ ప్రాంగణంలో ప్రాకారోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, వేదపండితులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

రైతులకు త్వరలో శుభవార్త

● ఎమ్మెల్యే పరిటాల సునీత



కందిపంటను పరిశీస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

ఆత్మకూరు నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఐదేళ్లలో ఒక కిలో మీటరు రోడ్డు కూడా వేయించలేని అసమర్థుడు ప్రకాశ్ రెడ్డి అని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత విమర్శించారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించే మంచి ప్రకటన ప్రభుత్వం నుంచి వస్తుందని ఆమె అన్నారు. మండల పరిధిలోని పి.కొత్తపల్లిలో అనంతరం 'రైతన్నా మీ కోసం'లో ఆమె పాల్గొన్నారు. రూ.కోటితో నిర్మించిన బీటీ రోడ్డును, రూ.25 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లు, ఆర్డీటీ, గ్రామ పంచాయతీ ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్లను ఆమె శనివారం ప్రారంభించారు. అంతకు ముందు కంది, చీనీ పంటలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి.. పంట దిగుబడి, సమస్యల గురించి తెలుసుకున్నారు. వ్యవసాయ అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలో అప్పటి మంత్రి శైలజానాథ్‌ను రోడ్లు వేయించాలని ప్రజలు అడిగితే, టీడీపీ గ్రామాలుకు రోడ్లు ఎలా వేస్తామని ప్రశ్నించారని అన్నారు. అందుకే పట్టుదలతో తమ గ్రామాలకు తానే రోడ్లు వేయిస్తున్నానని, అభివృద్ధి పనులు చేయిస్తున్నానని తెలిపారు. గ్రామంలో అన్నదాత సుఖీభవ ద్వారా 165 మంది రైతులుకు రూ.16.50 లక్షలు అందజేశామని తెలిపారు. అరటి, మొక్కజొన్న పంటకు మద్దతు ధర ప్రకటిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు మాట ఇచ్చారని అన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలకు బ్రేక్..!

● కొన్ని షాపుల్లో తనిఖీలతో సరిపెట్టిన వైనం
● 'రైతన్నా.. మీ కోసం'తో నిలుపుదల
● కొనసాగింపుపై సందేహాలు



అనంతపురంలోని ఎరువుల దుకాణంలో తనిఖీలు చేస్తున్న గుత్తి డివిజన్ ఏడీఏ వెంకటరాముడు

అనంతపురం అర్బన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎరువులు, పురుగు మందులు, విత్తనాల దుకాణాల్లో తనిఖీలకు బ్రేక్ పడింది. రైతన్నా.. మీకోసం కార్యక్రమం నిర్వహణతో తనిఖీలు నిలుపుదల చేసినట్లు తెలుస్తోంది. ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమం ముగిసిన తర్వాత.. తిరిగి తనిఖీలు కొనసాగిస్తారా..? లేదోనన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈనెల 15న ఈ ఏడాది రబీ సీజన్‌కు సంబంధించి ఏడీఏల నేతృత్వంలో ఇంటర్ డివిజన్ బృందాలను ఏర్పాటు చేశారు. ఒక డివిజన్ పరిధిలోని ఏడీఏని మరో డివిజన్‌లో తనిఖీలు చేపట్టేలా ఉత్తర్వులు ఇచ్చారు. అనంతపురం ఏడీఏ అల్తాఫ్ అలీఖాన్‌కు గుత్తి డివిజన్‌ను కేటాయించారు. గుత్తి ఏడీఏ వెంకటరాముడుకు అనంతపురం డివిజన్, తాడిపత్రి ఏడీఏ రవికి కళ్యాణదుర్గం, ఉరవకొండ ఏడీఏ సత్యనారాయణకు రాయదుర్గం, కళ్యాణదుర్గం ఏడీఏ యల్లప్పకు ఉరవకొండ, రాయదుర్గం ఏడీఏ పద్మజకు తాడిపత్రి డివిజన్‌ను కేటాయించారు. ఈనెల 17వ తేదీ నుంచి ఏడీఏలు తమకు కేటాయించిన డివిజన్లల్లో తనిఖీలకు వెళ్లారు. జిల్లా వ్యాప్తంగా అన్ని ఎరువులు, పురుగు మందులు, విత్తనాల దుకాణాల్లో తనిఖీలు చేపట్టాలని ఉత్తర్వుల్లో స్పష్టంగా పేర్కొన్నారు. కొందరు ఏడీఏలు తమకు కేటాయించిన డివిజన్లల్లో మూడు నుంచి నాలుగు షాపుల్లో తనిఖీలు చేయడంతో సరిపెట్టారు. మరికొందరు ఏడీఏలు పది దాకా షాపుల్లో తనిఖీలు చేసినట్లు సమాచారం.

ఊపిరి పీల్చుకుంటున్న డీలర్లు

రబీ సీజన్‌లో ఇంటర్ డివిజన్ తనిఖీలపై రైతన్నా.. మీకోసం కార్యక్రమం నిర్వహణ ప్రభావం పడింది. ఈనెల 24వతేదీ జిల్లాలో రైతన్నా.. మీకోసం కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. డిసెంబరు 3వతేదీ దాకా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు, సిబ్బంది ప్రతి ఇంటి వద్దకు వెళుతున్నారు. సీఎం చంద్రబాబు సూచించిన పంచసూత్రాలు నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వం నుంచి మద్దతులపై కరపత్రాలు పంపిణీ చేసి, వాటిపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. దీంతో తనిఖీలకు బ్రేక్ పడింది. తనిఖీలు నిలుపుదల కావడంతో నిబంధనలు అతిక్రమిస్తున్న డీలర్లు ఊపిరిపీల్చుకుంటున్నారు.

తిరిగి కొనసాగిస్తారో...? లేదో..?

రైతన్నా.. మీకోసం కార్యక్రమంతో నిలుపుదల చేసిన తనిఖీలను తిరిగి కొనసాగిస్తారా..? లేదా అటకెక్కిస్తారా..? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో కొందరు ఎరువులు, పురుగు మందులు, విత్తనాల దుకాణాల డీలర్లు ప్రభుత్వ నిబంధనలకు యథేచ్ఛగా అతిక్రమిస్తున్నారు. నిబంధనల మేరకు ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు దుకాణాల్లో తప్పనిసరిగా ధరల పట్టిక, స్టాక్ వివరాలు ప్రదర్శించాలి. జిల్లాలో ఎక్కువ శాతం దుకాణాల్లో ఈ నిబంధన అమలు కావడం లేదు. మరోవైపు రైతులకు కొనుగోలు చేసిన విత్తనాలు, మందులు, ఎరువులకు రసీదులు తప్పనిసరిగా ఇవ్వాలి. కొందరు డీలర్లు రసీదులు ఇవ్వకుండా రైతులకు కుచ్చుటోపీ పెడుతున్నారు. రసీదులు లేకపోవడంతో నాణ్యత లేని విత్తనాలు, పురుగు మందుల ద్వారా పంట సరిగా పంటకపోవడం.. పంట నష్టం జరిగిన సమయాల్లో రైతులకు పరిహారం కోసం ఫిర్యాదు చేసేందుకు అవకాశమే లేకుండా పోతోంది. దీంతో బాధిత రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. పలు ప్రాంతాల్లో ఎరువులను ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ముచేసుకుంటున్నారు. మరికొన్ని ప్రాంతాల్లో నాణ్యతలేని విత్తనాలు, పురుగు మందులను రైతులకు అంటగడుతూ మోసాలకు పాల్పడుతున్నారు. మరికొందరు డీలర్లు అనుమతులు లేని డిస్ట్రిబ్యూటర్ల నుంచి విత్తనాలు, పురుగు మందులు కొనుగోలు చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా కొనుగోలు చేసిన విత్తనాలు, పురుగు మందులను గుట్టుచప్పుడు కాకుండా రైతులకు అంటగడుతున్నారు. ఈ పరిస్థితుల్లో రైతన్నా.. మీ కోసం కార్యక్రమం అనంతరం తిరిగి ఇంటర్ డివిజన్ తనిఖీలను ముమ్మరం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఏడీఏలు నిష్పక్షపాతంగా వ్యవహరించి, నిబంధనల అతిక్రమణలపై చర్యలు తీసుకుంటే రైతుకు న్యాయం జరుగుతుంది.

వీఎల్‌టీ తగ్గింపునకు రూ.7 వేలు లంచం

● రెడ్ హ్యాండెడ్‌గా దొరికిన మున్సిపల్ ఆర్ఐ



పట్టుబడిన రామాంజినేయులు

హిందూపురం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రామాంజినేయులు లంచం తీసుకుంటూ ఏసీబీకి శనివారం పట్టుబడ్డాడు. ఖాళీ స్థలంపై పన్ను తగ్గించేందుకు పట్టణంలోని ముద్దిరెడ్డిపల్లికి చెందిన రవి కుమార్ అనే వ్యక్తి నుంచి రూ.7 వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు ఆయనను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. పన్ను విషయమై సంప్రదించిన రవికుమార్‌ను రూ.10 వేలు ఇవ్వాలని ఆర్ఐ డిమాండ్ చేశాడని, దీంతో బేరమాడి రూ.7 వేలకు బాధితుడు ఒప్పందం కుదుర్చుకున్నాడని ఏసీబీ అధికారులు తెలిపారు. లంచం ఇవ్వడం ఇష్టంలేక తమకు ఫిర్యాదు చేశాడని తెలిపారు.

ఆర్ఐ దొరకగానే..

ఏసీబీ అధికారుల సూచన మేరకు బాధితుడు మున్సిపల్ కార్యాలయం వద్దకు వెళ్లాడు. ఆర్ఐ రామాంజినేయులు బయటకు వచ్చి లంచం తీసుకోగానే ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఆయన్ను కార్యాలయం లోపలికి తీసుకువెళ్లి రెవెన్యూ విభాగంలో పలు రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. అక్కడి నుంచి ఆయన్ను వెంటబెట్టుకుని దండు రోడ్డులోని 36వ వార్డు సచివాలయానికి

(మిగతా 6వ పేజీలో)

రైతుల శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యం: విప్



రైతులకు డ్రిప్ పరికరాలు పంపిణీ చేస్తున్న విప్ కాలవ

గుమ్మఘట్ట, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైతుల శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యంగా పనిచేస్తుందని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు అన్నారు. శనివారం దేవరెడ్డిపల్లి గ్రామంలో రైతన్నా మీ కోసం కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని ఆయన రైతులకు ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ డ్రిప్ పరికరాలను పంపిణీ చేశారు. ఇంటింటికి వెళ్లి అన్నదాత సుఖీభవ ఇతర పథకాలపై కరపత్రాలు పంపిణీ చేశారు. రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతుల కోసం నిర్విరామంగా పనిచేస్తోందన్నారు. గత ప్రభుత్వం రైతులకు ఎటువంటి సబ్సిడీ పథకాలు అందించకుండా మోసం చేసిందన్నారు. ఈ రెండేళ్లలో వందల కోట్ల రూపాయలతో రైతులను చంద్రబాబు ఆదుకుంటున్నారని పేర్కొన్నారు. కన్వీనర్ కాలవ సన్నన్న, మాజీ కన్వీనర్ గిరిమల్లప్ప, ఉస్మాన్, వెంకటేశులు, కొండారెడ్డి, గోవిందప్ప, సర్పంచ్ రామాంజనేయులు పాల్గొన్నారు.

మురుగుతున్న నిర్లక్ష్యం

నగరంలో పడకేసిన పారిశుధ్య నిర్వహణ..

కాలువల్లో ముందుకు సాగని మురుగు (6లో)

తిరోగమనంలో టమోటా ధరలు

నాలుగురోజులుగా తగ్గు ముఖం

మందగించిన ఎగుమతులు

ఆందోళనలో అన్నదాతలు (7లో)



సరుకు రవాణాపై డీఆర్ఎం ఆన్‌లైన్ సమావేశం



ఆన్‌లైన్ సమావేశంలో పాల్గొన్న డీఆర్ఎం

గుంతకల్లు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): డివిజన్ రైల్వేలోని సరుకు రవాణా కంపెనీల ప్రతినిధులతో డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్త ఆన్‌లైన్ సమావేశాన్ని నిర్వహించారు. డివిజన్ పరిధిలో ఉన్న శ్రీ జయజ్యోతి సిమెంట్, ఏపీఐఐసీ, జానకి కార్పొరేషన్ లిమిటెడ్, ఏసీసీ సిమెంట్, సుగుణ స్టీల్స్ కంపెనీ ప్రతినిధులతో శనివారం ఉదయం చర్చించారు. సిమెంట్, స్టీల్ ఎగుమతులకు సంబంధించి టెర్మినల్స్‌లో చేపట్టాల్సిన కార్యక్రమంపై సూచనలు చేశారు. సీనియర్ డివిజనల్ ఆపరేషన్స్ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఏపీ రైతు సంఘం జిల్లా కమిటీ ఎన్నిక



బీహెచ్ రాయుడు



చంద్ర శేఖర్‌రెడ్డి

అనంతపురం టౌన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఏపీ రైతు సంఘం జిల్లా కమిటీ శనివారం ఎన్నికైంది. సంఘం జిల్లా 13వ మహాసభలను ఈ నెల 27, 28వ తేదీల్లో గార్లదిన్నె మండలంలో నిర్వహించారు. మహాసభల ముగింపు నేపథ్యంలో 34 మందితో కూడిన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. నూతన కమిటీ వివరాలను రైతుసంఘం జిల్లా కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సంఘం నాయకులు వెల్లడించారు. జిల్లా అధ్యక్షుడిగా బీహెచ్ రాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శిగా చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులుగా తరిమెల నాగరాజు, శివారెడ్డి, మధుసూదన్, విరూపాక్షి, రాజారాంరెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శులుగా దస్తగిరి, శిరీష, చెన్నారెడ్డి, కుళ్లాయప్ప, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

స్పాట్ అడ్మిషన్లకు నోటిఫికేషన్లు విడుదల చేయాలి

అనంతపురం రూరల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): స్పాట్ అడ్మిషన్లకు నోటిఫికేషన్లు విడుదల చేయాలని స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నాయకులు డిమాండ్ చేశారు. ఆ మేరకు శనివారం ఎస్కేయూ రిజిస్ట్రార్ రమేష్‌బాబుకు వినతిపత్రం ఇచ్చారు. అనంతరం మాట్లాడుతూ.. వర్సిటీలో పోస్ట్‌గ్రాడ్యుయేషన్ కోర్సులు, ఇతర కోర్సులకు సంబంధించిన స్పాట్ అడ్మిషన్ నోటిఫికేషన్ ఇంకా విడుదల కాకపోవడంతో పేద విద్యార్థులు నష్టపోతున్నారన్నారు. సెమిస్టర్ ప్రారంభం సమీపిస్తున్న నేపథ్యంలో స్పాట్ అడ్మిషన్లలో జరుగుతున్న ఆలస్యం విద్యార్థుల అకడమిక్ ప్రమాణంపై ప్రతికూల ప్రభావం చూపుతోందన్నారు. వీటిని దృష్టిలో ఉంచుకుని స్పాట్ అడ్మిషన్లు నిర్వహించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ యూనివర్సిటీ అధ్యక్షుడు పవన్, కార్యదర్శి శాంతిరాజు, సభ్యులు సాయికుమార్, ప్రేమ్‌కుమార్, జయంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జెరూసలేం యాత్రకు సబ్సిడీ పెంచండి

● సీఎంకు టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడి వినతి



సీఎంకు వినతిపత్రం ఇస్తున్న స్వామిదాస్

అనంతపురంక్రైం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జెరూసలేం యాత్రకు వెళ్లేందుకు సబ్సిడీ పెంచాలని టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఈటె స్వామిదాస్ సీఎం చంద్రబాబును కోరారు. విజయవాడలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం ఆయన సీఎంను కలిసి మాట్లాడారు. జెరూసలేం యాత్రకు ప్రతి ఏటా లక్షలాది మంది క్రిస్టియన్లు వెళ్తుంటారన్నారు. వారికి అందించే సబ్సిడీ పెంచాలన్నారు. ప్రస్తుతం 60 వేల సబ్సిడీ అందిస్తున్నారని, దాన్ని మరింత పెంచాలని కోరారు. అనంతరం వినతిపత్రం అందించారు. ఇందుకు సీఎం సానుకూలంగా స్పందించినట్లు స్వామిదాస్ తెలిపారు.



మన్సూర్‌ను వీల్‌చైర్‌పై స్కానింగ్‌కు తోసుకెళ్తున్న స్నేహితుడు

గాయం..!

ఎస్కేయూ ఇంజనీరింగ్ కళాశాల హాస్టల్‌లో ఓ విద్యార్థి గాయపడ్డాడు. మంచం తగలడంతో అరికాలికి గాయమై, తీవ్ర రక్తస్రావమైంది. వర్సిటీలోని ఆస్పత్రికి వెళ్లడంతో, సర్వజన వైద్యశాలకు వెళ్లాలని సూచించారు. దీంతో వర్సిటీ అంబులెన్స్‌ను పిలిపించారు. బాధిత విద్యార్థిని అంబులెన్స్‌లో ఎక్కిద్దామంటే డోర్ తెరుచుకోలేదు. తంటాలుపడి తెరిచి బయలుదేరితే.. అంబులెన్స్ సైకిల్ స్పీడ్‌ను కూడా అందుకోలేదు. ఆపసోపాలుపడి పెద్దాస్పత్రికి చేరుకున్నారు. అత్యవసర విభాగం వైద్యులు స్కానింగ్‌కు రాశారు. బాధితుడు నడవలేడు. స్ట్రెచర్, వీల్ చైర్ వంటివి కనిపించలేదు. ఎంఎన్‌ఓ అడ్రస్ లేరు. చాలాసేపు వేచిచూసిన అతని స్నేహితులు.. వెతికి ఓ వీల్ చైర్‌ను తెచ్చుకున్నారు. తామే తోసుకుంటూ స్కానింగ్‌కు తీసుకెళ్లారు. రెండు గంటలపాటు పోరాటం చేస్తేగానీ వైద్యం అందలేని బాధిత విద్యార్థి మన్సూర్, తన స్నేహితులు ఆవేదన వ్యక్తం చేశారు. వర్సిటీ అంబులెన్స్‌ను ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కోసం ఆర్టీఓ కార్యాలయానికి తీసుకువెళితే.. 'ఇది అంబులెన్సా?' అని అక్కడి అధికారులు ఫైల్‌ను పక్కకు విసిరేశారని విద్యార్థులు గుర్తుచేసుకున్నారు. ఆపద సమయంలో విద్యార్థులకు తగిన వైద్యం అందాలంటే.. ముందుగా వర్సిటీ అధికారులు అంబులెన్స్‌కు అయిన గాయాలకు వైద్యం చేయించాలి. పెద్దాస్పత్రి అత్యవసర విభాగంలో క్రీస్తు పూర్వం నుంచి కొనసాగుతున్న స్ట్రెచర్, వీల్‌చైర్ తదితర సమస్యలపై వైద్యాధికారులు దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.

- ఆంధ్రజ్యోతి, అనంతపురం వైద్యం



శిథిలావస్థలో ఎస్కేయూ అంబులెన్స్ అంతర్భాగం

శుభకార్యాలకు మూఢం

● ఫిబ్రవరి 17వరకు శుక్రమౌఢ్యమి ● పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలకు బ్రేక్ (6లో)

శుభకార్యాలకు మూఢం

ఫిబ్రవరి 17వరకు శుక్రమౌఢ్యమి

● అంతవరకూ ఆగాల్సిందే..

ధర్మవరం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): శుభకార్యాలకు బ్రేక్ పడింది. వచ్చే ఏడాది ఫిబ్రవరి 17 వరకు దాదాపు 82 రోజులు శుక్రమౌఢ్యమి (మూఢం)కొనసాగనుందని పండితులు రాజేశ్ తెలిపారు. ఈ సమ యాల్లో పెళ్లిళ్ల, గృహప్రవేశాలు, యజ్ఞాలు, కొత్తవ్యాపారాల ప్రారంభం తదితర పనులు చేయరాదని పండితులు చెబుతున్నారు. సాధారణంగా శుభకార్యాలు నిర్వహించాలంటే గురుబలం బాగా ఉండాలి. సిరిసంపదలు, సంతోషాలకు శుక్రబలం ఎక్కువగా ఉండాలి. శుక్రమౌఢ్యమి సమయంలో ఈ రెండు గ్రహాలు బలహీనంగా తేజస్సు కోల్పోయి ఉంటాయని అందుకే శుభకార్యాలు జరుపుకోవద్దని పండితులు సూచిస్తున్నారు.



నిర్వహణ బరువే : చెన్నంశెట్టి జగదీశ్, సీబీఎన్ కల్యాణమండపం యజమాని



మూఢం రావడంతో డిసెంబరు, జనవరి, ఫిబ్రవరి నెల వరకు కల్యాణమండపాలను అడిగే వారే ఉండరు. దీంతో కల్యాణమండపాల నిర్వహణకు కూడా బరువుగా మారుతుంది. కనీసం మున్సిపాలిటీ ట్యాక్స్‌లు కట్టడానికి కూడా ఇబ్బందే. అసలే ఆర్థిక సమస్యలతో కల్యాణమండపాలలో కాకుండా చాలామంది దేవాలయాలకు వెళ్లి వివాహాలు చేస్తున్నారు. ఇప్పుడు మూఢ్యం రావడం వల్ల నిర్వహణ మరింత కష్టతరంగా ఉంటుంది.

పవిత్ర తిథులు

మార్గశిర, మాఘ, ఫాల్గుణ మాసాల్లో శుభకార్యాలు అధికంగా జరుగుతాయి. ఈ ఏడాది మార్గశిరంలో ఒకటి, రెండుముహూర్తాలు ఉండగా పుష్యమాసం, శూన్యమాసం అవుతుంది. కనుక మాఘంలోనూ ఒక్క ముహూర్తం కూడా లేకపోవడం గమనార్హం. గృహ ప్రవేశాలకు అనుకూలమైన రథసప్తమి, సరస్వతి జన్మదినమైన వసంతపంచమి, మహామాఘిగా కీర్తింపడే మాఘపౌర్ణమి వంటి తిథులు ఈ సారి మూఢంలోనే ఉండటంతో శుభకార్యాలకు మంచిదికాదని పండితులు సూచిస్తున్నారు.

మూఢం అంటే

జ్యోతిష్య శాస్త్రం ప్రకారం ఒక గ్రహం సూర్యుడి కిరణాలలో కనుమరుగై పోవడాన్ని మౌఢ్యమి వాడుక భాషలో మూఢం(చీకటి) అని అంటారు. శుభకార్యాలకు గురువు ఎంత ప్రధాన కారకుడో శుక్రుడు అంతే ప్రభావం కలవాడు. గ్రహశక్తులు బలహీనపడటంతో శుక్ర గ్రహం సూచించే ఫలితాలు అంతగా అనుకూలంగా ఉండవు. శుక్రుడు బలహీనం అయితే సంబంధాలు, వివాహ జీవితం, ఆర్థిక స్థిరత్వంలో ప్రతికూలతలు ఏర్పడతాయని జ్యోతిష్యులు చెబుతున్నారు. అందుకే శుక్ర మౌఢ్యం ఉన్న కాలంలో శుభకార్యాలు జరిపించడం శుభ సూచికం కాదని సూచిస్తున్నారు.

వ్యాపారులపై ప్రభావం

శుభకార్యాలు లేకపోతే వివాహ మండపాలు, ఫంక్షన్‌హాళ్లు, వస్త్ర, ఆభరణాల దుకాణాలు, స్వర్ణకారులు, క్యాటరింగ్, ఫొటో, వీడియో గ్రాఫర్లు, టెంట్‌హౌస్, పూలదుకాణాలు, లైటింగ్, డీజేలు, అద్దెకార్లు, బస్సులు, సన్నాయి మేళం ఇలా సంబంధిత వర్గాలు నెలల కొద్ది నష్టపోవాల్సి వస్తుంది. పౌరోహిత్యంపై ఆధారపడ్డ వారికి గడ్డుకాలమే.

ఫిబ్రవరి 17 వరకు..



ఈ నెల 26 నుంచి 2026 ఫిబ్రవరి 17 వరకు దాదాపు మూడునెలల పాటు శుభ కార్యాలకు మంచిరోజులు లేవు. శుక్రమౌఢ్యం వల్ల ఒక్క శుభ ముహూర్తం ఉండదు. శుభకార్యాలతో పాటు గృహ ప్రవేశాలు, విగ్రహప్రతిష్ఠాపనలు కూడా చేసుకోకూడదు.

- రాజేశ్, పురోహితులు, ధర్మవరం

మురుగుతున్న నిర్లక్ష్యం

సోమనాథ్‌నగర్‌లో నడిమివంక దుస్థితి



నగరంలో పడకేసిన పారిశుధ్య నిర్వహణ.. కాలువల్లో ముందుకు సాగని మురుగు

- ఇంటింటా చెత్త సేకరణలో నిర్లక్ష్యం
- రికార్డుల్లోనే హాజరు...క్షేత్రస్థాయిలో కనబడరు
- అధ్వానంగా శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ల పనితీరు



కమలానగర్‌లో మురుగు కాలువ దుస్థితి

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): నగరంలో పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా మారింది. శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ల పనితీరు నానాటికి తీసికట్టుగా మారడంతో నగరంలో ఎక్కడ చూసినా మురుగు, చెత్త కనిపిస్తోంది. నగరంలో ఉన్న ఆరు సర్కిళ్లకు ఒక్కరే రెగ్యులర్ శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ఉన్నారు. మిగతా వాటికి మేస్త్రులే ఇన్‌చార్జ్‌లుగా వ్యవహరిస్తున్నారు. కనీస విద్యార్హత లేని వారికి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించడం వల్లే నగరంలో పారిశుధ్యం పడకేసిందనే ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. రికార్డుల ప్రకారం అటెండెన్స్ నూరు శాతం ఉండగా, క్షేత్రస్థాయిలో పారిశుధ్య సిబ్బంది కనుచూపు మేరలో కనిపించరు. బదిలీ పేరుతో రెగ్యులర్ వర్కర్ల నుంచి కొందరు అధికారులు ముడుపులు పుచ్చుకుని పనిదొంగలకు అండగా నిలుస్తుండటం వల్లే ఈ పరిస్థితి ఏర్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి.

సర్కిళ్లు పెంచాలి

నగరంలో పెరుగుతున్న జనాభా, నగర విస్తరణను దృష్టిలో ఉంచుకుని శానిటేషన్ సర్కిళ్లను పెంచాల్సిన అవసరం ఉంది. 40వేల జనాభాకు ఒక సర్కిల్ ఉండాలి. నగరంలో సుమారు 4లక్షలకు పైగా జనాభా ఉంది. ప్రస్తుతం 6 సర్కిళ్ల నుంచి పారిశుధ్య విభాగం పని చేస్తోంది. ప్రస్తుత జనాభా ప్రకారం 10సర్కిళ్లకు పైగా శానిటేషన్ విభాగం ఉండాలి. 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం 12 సర్కిళ్లను విభజించి, పనిభారం లేకుండా చేసింది. 2019లో వైసీపీ అధికారంలోకి రాగానే మళ్లీ ఆరు సర్కిళ్లకే కుదించింది. దీంతో నగరంలో పారిశుధ్య నిర్వహణ, ఇంటింటా చెత్తసేకరణపై పూర్తిగా నిర్లక్ష్యం ఏర్పడింది. నగరంలో ఉన్న ఆరు సర్కిళ్లలో ఒకటో సర్కిల్‌లో 110మంది, రెండో సర్కిల్‌లో 130, మూడో సర్కిల్‌లో 140, నాలుగో సర్కిల్‌లో 90, ఐదో సర్కిల్‌లో 92, ఆరో సర్కిల్‌లో 82మంది సిబ్బంది పని చేస్తున్నారు.

శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు పనితీరు మార్చుకోరా...!

నగరంలో పారిశుధ్యం, చెత్త సేకరణ మొత్తం శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ల పనితీరుపై ఆధారపడి ఉంటుంది. శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు నిబద్ధతగా పని చేస్తే నగరం పరిశుభ్రంగా ఉంటుంది. అయితే నగరం ఎట్లాపోతే మాకేంటి అన్న ధోరణిలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఉండటంతో పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా మారింది. ఉన్న సిబ్బందితో సక్రమంగా పని చేయించకుండా, రెగ్యులర్ వర్కర్లతో ముడుపులు పుచ్చుకుని వారి హాజరును చూసిచూడనట్లు ఉండటం వల్లే పరిస్థితి అధ్వానంగా మారిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

స్వచ్ఛాంధ్ర పథకానికి తూట్లు

రాష్ట్ర ముఖ్యమంత్రి తీసుకువచ్చిన స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమానికి అనంత నగరపాలక సంస్థ పారిశుధ్య విభాగం తూట్లు పొడుస్తోంది. నగరం రోడ్లపై చెత్త, మురుగు కనిపించకుండా, శుభ్రంగా ఉంచడమే స్వచ్ఛాంధ్ర లక్ష్యం. అయితే నగరంలో ఇందుకు విరుద్ధమైన పరిస్థితి ఉంది. నగరంలో హౌసింగ్‌బోర్డు, అరవిందనగర్, అశోక్‌నగర్, పాతూరు, రామచంద్రనగర్, రంగస్వామినగర్, రజకనగర్, వేణుగోపాల్‌నగర్, శారదానగర్ ప్రాంతాలలో వారానికి ఒక్కసారి లేదా రెండు సార్లు మాత్రమే ఇంటింటా చెత్త సేకరిస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. మురుగు కాలవలను ఆరు నెలలైనా శుభ్రం చేయకపోవడంతో చెత్త, మురుగు పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో పందులు యథేచ్ఛగా తిరుగుతున్నాయని, దోమలు వృద్ధి చెంది పగలే కుట్టేస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



గుత్తిరోడ్డులో భగత్‌సింగ్ నగర్ చెత్తదిబ్బలో ఆవులు

మెరుగు పరిచేందుకు చర్యలు

నగరంలో పారిశుధ్యం మెరుగు పరచడానికి అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం. పనితీరు మెరుగుపరుచుకోవాలని శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లకు ఇదివరకే సూచించాం. నగరంలో ఆకస్మిక తనిఖీలు చేసి, కార్మికుల పనివేళలు, హాజరు నమోదును ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నాం. ప్రజల ఫిర్యాదులను పరిగణలోకి తీసుకుని మురుగు, చెత్త వెంటనే తొలగించేలా చూస్తున్నాం. ఎమ్మెల్యే, కమిషనర్‌లు తెల్లవారుజామున సర్కిల్ ఆఫీసుల్లో సిబ్బంది అటెండెన్స్ రికార్డులు, క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బందిని పరిశీలించారు. విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తే శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బందిపై చర్యలు తప్పవు.

- బీఎల్ నరసింహులు, ఎంహెచ్ఓ, అనంత నగరపాలక సంస్థ

మంత్రి ఇచ్చిన మాట..!

(5 పేజీ తరువాయి)

చేస్తున్నారు. వాటిని ఢిల్లీ సహా దేశంలోని వేర్వేరు ప్రాంతాలకు తరలించి భారీ లాభాలను గడిస్తున్నారు. కానీ రైతులకు కష్టానికి తగిన ఫలితం ఉండటం లేదు. కొందరు రైతులు బయట వ్యాపారులకు, మరికొందరు రైతులు అనంతపురం మార్కెట్ యార్డులో చీనీ పంటను అమ్ముకుంటున్నారు. ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేస్తే రైతులకు మేలు జరుగుతుంది. ఈ విషయాన్ని గుర్తించే.. మంత్రి నారా లోకేశ్ చీనీ రైతులకు అండగా నిలవాలని నిర్ణయించారు. కానీ అధికారుల అలసత్వం కారణంగా హామీ అమలులో జాప్యం జరుగుతోంది.



ఇటీవల కనుంపల్లిలో స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

స్థలం ఎంపికలో గందరగోళం

మంత్రి లోకేశ్ శిలాఫలకాన్ని ఆవిష్కరించిన మర్తాడులోనే చీనీ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయాలని స్థానిక రైతులు కోరుతున్నారు. గార్లదిన్నె మండలంలో చీనీ ఎక్కువగా పండించే గ్రామాలతోపాటు ఉరవకొండ, ఇతర మండలాల రైతులకు మర్తాడు గ్రామం అనుకూలమని స్థానిక రైతులు చెబుతున్నారు. మర్తాడులో చీనీ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయాలన్న ఉద్దేశంతోనే మంత్రి ఇక్కడ శిలాఫకలం ఏర్పాటు చేశారనే అభిప్రాయాన్ని స్థానిక రైతులు, ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. మర్తాడులో చీనీ ప్రాసెసింగ్ ఏర్పాటు చేసేందుకు అనువైన స్థలం కూడా ఉందని చెబుతున్నారు. కనుంపల్లి, జంబులదిన్నె కొట్టాల ప్రాంతాల్లో చీనీ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు అధికారులు స్థలాలను పరిశీలించడాన్ని మర్తాడు ప్రజలు వ్యతిరేకిస్తున్నారు.

మర్తాడులో అనుకూలం..



మర్తాడులో చీనీ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేసేందుకు మంత్రి లోకేశ్ శిలాఫకలాన్ని ఆవిష్కరించారు. అప్పట్లోనే హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ కూడా హామీ ఇచ్చారు. అధికారులు మండలంలోని ఇతర గ్రామాల్లో చీనీ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేసేందుకు స్థలాలను పరిశీలించడం ఏమిటో అర్థం కావడం లేదు. మర్తాడులో చీనీ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తే మండలంలోని ఇతర గ్రామాలు, ఇతర మండలాల రైతులకు చాలా అనుకూలంగా ఉంటుంది. ఎమ్మెల్యే బండారు శ్రావణి, కలెక్టర్, ఆర్డీఓల దృష్టికి ఇదివరకే ఈ విషయాన్ని తీసుకువెళ్లి, వినతి పత్రాలు సమర్పించాము. రైతులందరికీ అనుకూలమైన మర్తాడులోనే చీనీ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం.

- ఆవుల కృష్ణయ్య, టీడీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు

హామీని నిలబెట్టుకోవాలి..



యువగళం పాదయాత్రలో మంత్రి నారాలోకేశ్ ఇచ్చిన హామీని తక్షణమే అమలు చేయాలి. మర్తాడులో చీనీ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేసేందుకు శిలాఫకలాన్ని ఆవిష్కరించారు. చీనీ పంటను ఎక్కువగా గార్లదిన్నె మండలంలో పండిస్తున్నారన్న కారణంతో అక్కడే చీనీ ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించడం మంచిదే. ఆరు నెలల క్రితం ఫుడ్ ప్రాసెసింగ్ అధికారులు గార్లదిన్నె మండలంలో స్థల పరిశీలన చేసి, అంతటితో సరిపెట్టారు. స్థానిక రైతుల అభీష్టం మేరకు అనుకూలమైన ప్రాంతంలోనే ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలి.

- చంద్రశేఖర్‌రెడ్డి, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

త్వరలోనే ఏర్పాటు..



గార్లదిన్నె మండలంలో చీనీ ప్రాసెసింగ్ యూనిట్‌ను త్వరలోనే ఏర్పాటు చేసే అవకాశం ఉంది. ఫుడ్ ప్రాసెసింగ్ విభాగం రాష్ట్ర ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ జరుగుతుంది. గార్లదిన్నె మండలంలోని జంబులదిన్నె కొట్టాల, కనుంపల్లిలో రెండు ప్రాంతాల్లో రెవెన్యూ అధికారులు స్థలాలను చూపించారు. మంత్రి నారా లోకేశ్ మర్తాడు వద్ద శిలాఫలకం ఆవిష్కరించినందున, మర్తాడు ప్రాంతంలోనే చీనీ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు స్థలాన్ని ఎంపిక చేయాలని శింగనమల ఎమ్మెల్యే సూచించారు. మర్తాడు ప్రాంతంలో ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తే రైతులకు అనుకూలంగా ఉంటుందని ఎమ్మెల్యే భావిస్తున్నారు. స్థలం ఎంపిక మరో వారం రోజుల్లో పూర్తయ్యే అవకాశం ఉంది.

- ఉమాదేవి, ఉద్యానశాఖ జిల్లా అధికారి

ఏసీబీ వలలో ఆర్ఐ

(5వ పేజీ తరువాయి)

వెళ్లి, కొన్ని రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. లంచంగా తీసుకున్న మొత్తం ఆర్ఐకేనా, లేక సచివాలయంలో పనిచేసే ఇతరులకూ వాటా ఉందా అన్న కోణంలో ఏసీబీ అధికారులు విచారిస్తున్నారు. దాడులలో ఏసీబీ ఉమ్మడి అనంతపురం జిల్లా ఇన్చార్జి డీఎస్పీ సోమన్న, సీఐలు హమీద్ ఖాన్, జయమ్మ, మోహన్‌కృష్ణ పాల్గొన్నారు. నిందితుడిని అరెస్టు చేశామని, కర్నూలు ఏసీబీ కోర్టులో హాజరుపరుస్తామని తెలిపారు.

రూ.3 వేల పన్నుకు..

రవి కుమార్ ఇటీవల ముద్దిరెడ్డిపల్లిలో 69 గజాల స్థలాన్ని కొనుగోలు చేశాడు. దీనికి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రూ.6 లక్షలకుపైగా విలువ కట్టారు. నిబంధనల మేరకు ఈ స్థలానికి ఏడాదికి రూ.1200 చొప్పున మున్సిపాలిటీకి పన్ను కట్టాలి. నిబంధనల ప్రకారం రెండున్నరేళ్లకు ఖాళీ స్థలం పన్ను (వీఎల్‌టీ) కట్టించుకుంటారు. అలా లెక్కించినా పన్ను రూ.3 వేలు మాత్రమే కట్టించుకోవాలి. కానీ పన్ను కట్టించుకునేందుకు రూ.10 వేలు డిమాండ్ చేశాడు ఆర్ఐ రామాంజినేయులు. అందుకే బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు.

ప్రభుత్వానికి రాశాం..

ఆర్ఐని పట్టుకున్న అనంతరం ఏసీబీ డీఎస్పీ సోమన్న విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ అధికారులు, సిబ్బంది లంచం డిమాండ్ చేస్తే ఏసీబీ అధికారులకు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానం ఇస్తూ, చిలమత్తూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ దాడుల అనంతరం రికార్డులను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అక్కడ లభించిన నగదుపై ప్రభుత్వానికి నివేదిక పంపించామని అన్నారు. అక్కడి నుంచి ఆదేశాలు వచ్చాక కేసు నమోదు చేస్తామని తెలిపారు. ఏ ప్రభుత్వ ఉద్యోగి వద్దా కార్యాలయంలో ఉన్నప్పుడు రూ.వెయ్యికి మించి డబ్బు ఉండకూడదని అన్నారు. ఒకవేళ డబ్బులు ఉంటే రిజిష్టర్‌లో నమోదు చేయాలని అన్నారు. ఏసీబీ అధికారులం ఆకస్మిక తనిఖీలు చేస్తుంటామని, ఆ సమయంలో నగదు పట్టుబడితే కేసులు నమోదు చేస్తామని, లేదంటే ఆ సమాచారాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు.



విలేకరులతో మాట్లాడుతున్న ఏసీబీ డీఎస్పీ సోమన్న

అధికారులు పరార్

ఏసీబీ అధికారుల దాడులు విషయం తెలియగానే మున్సిపల్ కార్యాలయంలోని పలు విభాగాల ఉద్యోగులు మాయమయ్యారు. అధికారులు కనిపించకుండా పోయారు. పట్టణంలోని మరికొన్ని కార్యాలయాల్లో పనిచేసే అధికారులు ముందుగానే విధులు ముగించుకుని వెళ్లిపోయారు. దీంతో సాయంత్రం 4 గంటలు దాటకనే కార్యాలయాల్లో కుర్చీలు ఖాళీగా దర్శనమిచ్చాయి.

కార్మిక హక్కులను కాలరాస్తున్న లేబర్‌కోడ్లు

● ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్రనాథ్

పుట్టపర్తి టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్లు కార్మికుల హక్కులను కాలరాస్తున్నాయని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ విమర్శించారు. పుట్టపర్తిలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సురేంద్ర చౌదరి అధ్యక్షతన జిల్లా జనరల్ బాడీ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన రవీంద్రనాథ్ మాట్లాడుతూ దేశంలో సంపద సృష్టిస్తున్న కార్మికులు, రైతన్నలపైన ప్రభుత్వాలు ఇబ్బందులు కలిగించే చట్టాలను తీసుకువస్తున్నాయన్నారు. ఏఐటీయూసీ కార్మిక వర్గానికి కావలసిన చట్టాలను పోరాటాలు చేసి సాధించిందన్నారు. 44 చట్టాలు ఏఐటీయూసీ పోరాట ఫలితంగా సాధ్యమయ్యాయన్నారు. నాలుగు లేబర్ కోడ్లను అమలు చేస్తే 29 చట్టాలు రద్దు అవుతాయని దాని ఫలితంగా కార్మికులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందన్నారు. కార్మిక యూనియన్ ఏర్పాటు చేయాలంటే 100 మందికిపైగా కార్మికులు ఉండాలని లేబర్ కోడ్స్ చెబుతున్నాయన్నారు. కార్మిక హక్కులను నిర్వీర్యం చేసే నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేసి పాత చట్టాలను యథాతథంగా ఉంచాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ మాట్లాడుతూ కార్మిక వర్గాన్ని నిర్వీర్యం చేయడానికి 4 లేబర్ కోడ్‌లను కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. ఆర్ఎస్ఎస్ భావాజాలంతో కేంద్రప్రభుత్వం ముందుకు సాగుతోందని విమర్శించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి రాజారెడ్డి, బాలకాశి, జిల్లా కార్యదర్శి ఆంజనేయులు, అనంతపురం అధ్యక్షులు రాజేష్, వెంకటేష్, వినోద్, పెద్దన్న, ఆనంద్ బాబు, మధునాయక్, బాబు, సంపూర్ణమ్మ, నాగవేణి, కిరణ్ పాల్గొన్నారు.

టమోటా కిలో రూ.34

అనంతపురం రూరల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్లో శనివారం టామోటాలు కిలో గరిష్ఠంగా రూ.34తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అలాగు కనిష్ఠంగా రూ.14తో, సరసరిగా రూ.20తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 1650 టన్నుల టమోటాలు వచ్చినట్లు చెప్పారు.

చీనీ టన్ను రూ.22 వేలు



అనంతపురం రూరల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): అనంత వ్యవసాయ మార్కెట్లో శనివారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.22,500తో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి, మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్రకుమార్ తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.10వేలు, సరాసరి ధర రూ.15వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 23టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.

పప్పుశనగలో ఆకుమాడు తెగులు



పప్పుశనగ కాండం ఎండుతున్న దృశ్యం

యల్లనూరు, నవంబరు29(ఆంధ్రజ్యోతి): మండలంలో సాగుచేసిన పప్పుశనగ పంటకు ఆకుమాడు తెగులు సోకినట్లు వ్యవసాయాధికారి కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. జంగంపల్లి గ్రామంలో పప్పుశనగ పొలాలను పరిశీలించగా ఆకుమాడు తెగులు సోకినట్లు గుర్తించామన్నా రు. ఈ తెగులు ఆశించిన పొలంలో అక్కడక్కడ మొక్కలు ఎండిపోతున్నాయని, కొమ్మలపై గోధుమరంగు మచ్చలు ఏర్పడి కొనభాగం నుంచి కింద వరకు కనిపిస్తున్నట్లు తెలిపారు. అకాల వర్షాలు కురిసినప్పుడు ఈ వ్యాధి సోకే అవకాశం ఉన్నట్లు ఆయన వెల్లడించారు. వ్యాధి నివారణకు ఒక ఎకరాకు హెక్సా కొనజోల్ 400మిల్లీలీటర్లు లేదా ప్రొపికొనజోల్ 200మిల్లీలీటర్లు లేదా క్లోరోథలోనిల్ 400గ్రాముల చొప్పున పిచికారీ చేయాలన్నారు.



పొలాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య


హనుమంత రాయుడు (ఫైల్)

కుందుర్పి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన చాకలి హనుమంతరాయుడు (52) అప్పుల బాధతో శుక్రవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు హనుమంతరాయుడుకు నాలుగెకరాల పొలం ఉంది. అందులో బోరుబావి తవ్వించి, మామిడిసాగు చేశాడు. ఇందుకోసం అప్పులు చేశారు. వాటిని తీర్చలేక పొలాన్ని సైతం బ్యాంకులో తాకట్టుపెట్టాడు. అప్పులు తీర్చేందుకు ఉపాధి కోసం ఏడాది కిందట భార్య అంజనమ్మ, కుమారుడు నవీన్‌తో కలిసి బెంగళూరుకు వలస వెళ్లాడు. వారం రోజుల కిందట బెంగళూరు నుంచి కుందుర్పికి వచ్చాడు. గతంలో ఈయన పెయింట్ పని చేసేవాడు. ఈ నేపథ్యంలో స్థానికంగా పెయింట్ పని దొరికిందని, దాన్ని ముగించుకుని వస్తానని బెంగళూరులోని కుటుంబ సభ్యులకు తెలిపాడు. పని ముగించుకుని శుక్రవారం ఇంటికి వచ్చాడు. ఒంటరిగా ఉండటంతో చేసిన అప్పులు గుర్తుకు వచ్చి, మథనపడుతూ ఇంటి పైకప్పునకు ఉరి వేసుకున్నాడు. చుట్టుపక్కల వారు శనివారం ఉదయం గమనించి కుటుంబ సభ్యులకు సమాచారాన్ని అందించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

మద్యానికి బానిసై..

బ్రహ్మసముద్రం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఎరడికెర గ్రామానికి చెందిన రవి(30), మద్యానికి బానిసై ఆత్మహత్య చేసుకున్నాడని పోలీసులు తెలిపారు. మద్యం సేవించేందుకు డబ్బులు కావాలని తన తండ్రి నాగరాజును శనివారం మధ్యాహ్నం అడిగాడని, తన వద్ద డబ్బులు లేవని ఆయన చెప్పడంతో ఇంట్లోకి వెళ్లి చీరతో ఉరివేసుకున్నాడని తెలిపారు. తండ్రి వెళ్లి చూసేసరికే మృతి చెందాడని తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. రవికి భార్య గౌరమ్మ, ఇద్దరు కూతుర్లు, ఒక కుమారుడు ఉన్నారు.

బకెట్‌లో పడి బాలుడి మృతి

అనంతపురం క్రైం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఆడుకుంటూ వెళ్లి నీటి బకెట్‌లో పడిన పసివాడు ప్రాణాలు కోల్పోయాడు. ఈ విషాద సంఘటన అనంతపురం రాణి నగర్‌లో శనివారం చోటు చేసుకుంది. కాలనీకి చెందిన ఫల్హాజ్, షబ్బీన్ దంపతులకు మూడేళ్లు, 11 నెలల వయసున్న ఇద్దరు కుమారులు శుక్రవారం ఇంటి ముందు ఆటల్లో మునిగిపోయారు. చిన్న కుమారుడు మహ్మద్ ఆహిల్ దగ్గరల్లో ఉన్న నీటి బకెట్ వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తూ అందులో తల్లకిందులుగా పడిపోయాడు. బాలుడి తల్లి ఆలస్యంగా గుర్తించి, వెంటనే ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ఐసీయూలో చికిత్స అందించారు. బాలుడు కోలుకోలేక శనివారం తెల్లవారుజామున మృతిచెందాడు. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అదృశ్యం


వెంకటరమణ(ఫైల్)

పుట్లూరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొండుగారికుంట గ్రామానికి చెందిన వల్లపు వెంకటరమణ(35) అదృశ్యమయ్యాడని పోలీసులు శనివారం తెలిపారు. ఈ నెల 26వ తేదీ మధ్యాహ్నం బహిర్భూమికి వెళుతున్నానని తన భార్యతో చెప్పి వెళ్లాడని, ఆ తరువాత తిరిగి రాలేదని తెలిపారు. వెంకటరమణ భార్య గీతాంజలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఆనంద్‌ది ఆత్మహత్యే: డీఎస్పీ


మాట్లాడుతున్న డీఎస్పీ రవిబాబు

కళ్యాణదుర్గం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన ఆనంద్‌ది ఆత్మహత్యేనని డీఎస్పీ రవిబాబు విలేకరులకు శనివారం స్పష్టం చేశారు. ఈ నెల 21న కళ్యాణదుర్గం శివారులో ఆనంద్ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడని తెలిపారు. ఉద్యోగం రానందుకు జీవితంపై విరక్తి చెంది తమ కుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడని తల్లిదండ్రులు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారని తెలిపారు. ఆ తరువాత తమ కుమారుడి మరణంపై అనుమానాలు ఉన్నాయని, హత్య చేశారని ఫిర్యాదు చేశారని తెలిపారు. దీంతో పూర్తిస్థాయిలో విచారించామని, పోస్టుమార్టం నివేదికను పరిశీలించామని అన్నారు. హత్య కోణంలో దర్యాప్తు చేశామని, ఆత్మహత్యే అని తేలిందని అన్నారు. ఈ కేసు విషయంలో ఎటువంటి రాజకీయ కోణాలు లేవని స్పష్టం చేశారు. ఇది హత్యేనని భావిస్తే తగిన ఆధారాలు, సాక్ష్యాలను తమకు అందజేయాలని సూచించారు. పోలీసులపై బురద చల్లడం, పరువు హత్య అని ఆరోపణలు చేసేముందు వాస్తవాలు తెలుసుకోవాలని అన్నారు.

ఆర్డీటీ స్టేడియంలో రికీ కేజ్


ఆర్డీటీ విద్యార్థులతో రికీ కేజ్

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): నగర శివారులోని ఆర్డీటీ స్టేడియాన్ని గ్రామీ, పద్మశ్రీ అవార్డు గ్రహీత రికీ కేజ్ శనివారం సందర్శించారు. ఆయనకు ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచో ఫెర్రర్, మహిళా సాధికారత డైరెక్టర్ విశాలాఫెర్రర్ దంపతులు ఘనంగా స్వాగతం పలికారు. స్టేడియంలో క్రికెట్ గ్రౌండ్, వసతులను రికీ కేజ్ పరిశీలించి, అకాడమీలో పిల్లలతో సంభాషించారు. ఈ సందర్భంగా రికీ కేజ్ మాట్లాడుతూ ఆర్డీటీని సందర్శించడం చాలా సంతోషంగా ఉందని, ఆర్డీటీ క్రీడా మైదానం, ఆవరణలో అత్యాధునిక వసతులు అద్భుతంగా ఉన్నాయని ప్రశంసించారు. ఆర్డీటీ ఇన్‌క్లూజివ్ హైస్కూల్ చాలా స్ఫూర్తిదాయకంగా ఉందన్నారు. మాంచో ఫెర్రర్ మాట్లాడుతూ రికీ కేజ్ ఆర్డీటీని సందర్శించడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ సాయికృష్ణ పాల్గొన్నారు.

వైసీపీ నాయకుడికి రిమాండ్

టీడీపీ నాయకుడిపై దాడి ఫలితం


కోర్టు ఆవరణలో వైసీపీ నాయకుడు కృష్ణమూర్తి

అనంతపురం క్రైం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మూడో డివిజన్‌కు చెందిన వైసీపీ నాయకుడు, జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ బావ కృష్ణమూర్తికి కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. దీంతో పోలీసులు శనివారం ఆయన్ను అనంతపురం సబ్‌జైలుకు తరలించారు. ఇటీవల టీడీపీ నేతపై దాడికి సంబంధించిన కేసులో ఆయనను వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేసి, కోర్టుకు హాజరుపరిచారు. ఈ నెల 21న 3వ డివిజన్‌లో తన భర్తపై వైసీపీ నాయకుడు కృష్ణమూర్తి, రాణినగర్‌కు చెందిన మరికొందరు దాడి చేశారని టీడీపీ నాయకుడు కురువ గోపాల్ భార్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరిచారు.

టీచర్లకు క్రీడాపోటీలు ప్రారంభం

అనంతపురం విద్య, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల క్రీడాపోటీలు మండలస్థాయిలో శనివారం ప్రారంభమయ్యాయి. ఎంఈఓల పర్యవేక్షణలో పురుషులకు క్రికెట్, మహిళలకు త్రోబాల్ పోటీలు నిర్వహించారు. తొలి రోజు ఆయా మండలాలలోని వివిధ ఉన్నత, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలలకు చెందిన పురుష, మహిళా టీచర్లు మండల కేంద్రంలో జరిగిన పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. గురువులు ఆడుతున్న ఆటలపోటీలను విద్యార్థులు తిలకిస్తూ కేరింతలు కొట్టారు. ఆదివారం కూడా పోటీలు కొనసాగనున్నాయి. ఇక్కడ విజేతలుగా నిలిచిన టీమ్‌లను డివిజన్ స్థాయి పోటీలకు, అక్కడా విజయం సాధిస్తే జిల్లా, ఆపై రాష్ట్రస్థాయి పోటీలకు పంపనున్నారు.

తిరోగమనంలో టమోటా ధరలు

నాలుగురోజులుగా తగ్గు ముఖం

మందగించిన ఎగుమతులు

ఆందోళనలో అన్నదాతలు


మార్కెట్‌కు తరలించడానికి టమోటాలను సిద్ధం చేస్తున్న కూలీలు

అనంతపురంరూరల్/తనకల్లు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): టమోటా రైతుల ఆనందం వారం తిరక్కుండానే ఆవిరైపోతోంది. పది రోజుల క్రితం కిలో రూ.50 దాటిన టమోటా ధరలు రూ.34కు పడిపోయాయి. వెరసి టమోటా ధరలు అన్నదాతల జీవితాలతో ఆటడుకుంటున్నాయి. రెండు వారాల క్రితం ఓ మోస్తారుగా సాగాయి. తరువాత ఉన్నఫలంగా ధరలు పెరిగిపోయాయి. ఉమ్మడి జిల్లాలో కిలో గరిష్ట ధరలు రూ.50పైగా పలికాయి. దీంతో రైతుల్లో ఆశలు చిగురించాయి. స్థిరంగా సాగుతున్నాయనుకునేలోపు మళ్లీ తిరోగమనం పట్టాయి. మూడునాలుగురోజులు పతనం వైపు పయనిస్తున్నాయి. జిల్లా నుంచి ఎగుమతులు మందగించడంతో పరిస్థితులు తలకిందులయ్యాయి. తనకల్లు మండలంలో ఖరీఫ్, రబీ సీజన్లతో సంబంధంలేకుండా వేలాది ఎకరాల్లో రైతులు టమోటా సాగు చేస్తుంటారు. టమోటా సాగుచేయడానికి ఎకరానికి రూ.1.50 లక్షల వరకు ఖర్చు చేస్తున్నారు. పంటలు చేతికొచ్చే సమయంలో ధరలు నిలకడగా ఉంటే ఎకరాకు రూ.5నుంచి 10 లక్షల వరకు ఆదాయం వచ్చేది. రైతులు అన్నమయ్య జిల్లా ములకలచెరువు, అంగళ్లు, మదనపల్లి మార్కెట్లతో పాటు, కర్ణాటకలోని చింతామణి, వడ్డిపల్లి, కోలార్‌కు టమోటాలను తరలిస్తున్నారు.

గత పదిరోజులుగా టమోటా ధరలు ఇలా

తేది	గరిష్టం కిలో ధర రూ.	సరాసరి	కనిష్టం
20	50	37	27
21	52	37	30
22	47	30	24
23	47	30	24
24	51	37	27
25	49	37	27
26	46	30	24
27	40	27	20
28	37	24	14
29	34	20	14

మూడు రోజుల నుంచి పతనం

అనంతపురం నగరం సమీపంలోని కక్కలపల్లి, కళ్యాణదుర్గంలో టమోటా మార్కెట్లు నడుస్తున్నాయి. ఇప్పటికే కళ్యాణదుర్గంలో మండీలు బంద్ అయినట్లు మార్కెట్ వర్గాలు అంటున్నాయి. కక్కలపల్లి టమోటా మార్కెట్‌కు రోజూ 1800 నుంచి 2,300 టన్నుల వరకు వస్తున్నాయి. గతంలో కంటే ప్రస్తుతం దిగుబడులు మార్కెట్‌కు తక్కుగానే వస్తున్నాయి. పదిహేను రోజుల కిందట వరకు మేలిరకం కాయలు గరిష్టంగా కిలో రూ.20 నుంచి రూ.25 మధ్య పలికాయి. తరువాత అమాంతం పెరిగి కిలో రూ. 50తో అమ్ముడుపోయాయి. సరాసరి ధరలు రూ.35కిపైగా.. కనిష్ట ధరలు రూ.25తో పలికాయి. దీంతో రైతుల్లో ఆశలు చిగురించాయి. ఇంతలోనే పరిస్థితులు తలకిందులయ్యాయి. గడిచిన మూడునాలుగురోజుల్లో మార్కెట్‌లో ధరలు పరిశీలిస్తే ఇదే విషయం అర్థమవుతుంది.

మందగించిన ఎగుమతులు

ధరల తగ్గుదలకు కారణాలు లేకపోలేదు. మార్కెట్ నుంచి ఎగుమతులు మందగించడం ధరల్లో తగ్గుదలకు ప్రధాన కారణమన్న వాదనలు ఆయా వర్గాల నుంచి వినిపిస్తున్నాయి. వాతావరణంలో నెలకొన్న మార్పులు మరోకారణంగా నిలుస్తున్నాయి. నాలుగైదురోజుల కిందట వరకు స్థానిక మార్కెట్ నుంచి ఉత్తర ప్రదేశ్, మహారాష్ట్ర, ఢిల్లీ తదితర ప్రాంతాలకు ఎగుమతులు జరిగేవి. ఆయా ప్రాంతాల్లోని స్థానిక మార్కెట్లకు దిగుబడులు లేకపోవడంతో ఎగుమతులు ఆశాజనకంగా సాగాయి. ప్రస్తుతం ఎగుమతులు చాలా వరకు తగ్గిపోయినట్లు తెలుస్తోంది. స్థానిక మార్కెట్‌కు ఆయా ప్రాంతాల నుంచి దిగుబడులు వస్తున్నట్లు మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రస్తుతం కేవలం ఆంధ్ర, తమిళనాడు చుట్టుపక్కల ప్రాంతాలకు మాత్రమే ఇక్కడి నుంచి కాయలు ఎగుమతి అవుతున్నాయి.

ఉన్నట్లుండి మార్పులు..



నేను రెండు ఎకరాల్లో టమోటా పంటను సాగుచేశా. పది రోజులక్రితం వరకు టమోటాకు ధరలు లేవు. అడిగే ఆనాథుడే లేక అలాగే వదిలేశాం. ఉన్నట్లుండి ధరలు పెరగడంతో వదిలేసిన తోటకు మందులు పిచికారి చేసి, డ్రిప్ ఎరువులిచ్చి పంటను కాపాడుకున్నా. వారం రోజులపాటు 30 కిలోల బాక్స్ ధర రూ.1400, 1100, 900 పలికాయి. ప్రస్తుతం రూ.600 ధర పలుకుతున్నాయి. నాలుగైదు కోతలు మాత్రమే ధరలు పలికాయి. ప్రస్తుతం ప్రతిరోజూ ధరలు తగ్గిపోతున్నాయి. వాతావరణంలో మార్పుల వల్ల ఉన్నపంటల దెబ్బతింటున్నాయి.

\- సూరి, రైతు, పెద్దపల్లి, తనకల్లు మండలం

ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలి

తనకల్లు మండలంలో సీజన్లతో సంబంధం లేకుండా వేలాది ఎకరాలో టమోటాలు సాగు చేస్తుంటారు. టమోటాకు ధరలు లేనప్పుడు పొలాల్లో వదిలేస్తున్నారు. నేను సీజన్‌తో సంబంధం లేకుండా టమోటా సాగుచేస్తున్నాను. ప్రస్తుతం ఎకరాలో టమోటా సాగుచేశా. టమోటా ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలి. అవి ఉంటే టమోటాలకు గిట్టుబాటు ధరలు ఉంటాయి. ఇక్కడ పండించే టమోటాలతోనే ఈ ప్రాంతంలో ప్రాసెసింగ్ యూనిట్లు నడపవచ్చు.



\- సూర్యనారాయణ, రైతు, కొత్తకురవపల్లి

క్రీడలతో ఆత్మవిశ్వాసం: కలెక్టర్


పోటీలను ప్రారంభిస్తున్న కలెక్టర్, చైర్మన్

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): క్రీడాపోటీల్లో పాల్గొనడం ద్వారా విభిన్న ప్రతిభావంతులలో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని కలెక్టర్ ఆనంద్ పేర్కొన్నారు. అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం స్థానిక నీలం సంజీవరెడ్డి పీటీసీ మైదానంలో నిర్వహించిన విభిన్న ప్రతిభావంతుల క్రీడాపోటీలను కలెక్టర్, విభిన్న ప్రతిభావంతుల కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ నారాయణస్వామి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ప్రభుత్వం అందించే రిజర్వేషన్లు, పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం అథ్లెటిక్స్, సాఫ్ట్‌బాల్ క్రీడా పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఏడీ అర్చన, బీసీ సంక్షేమ శాఖ డీడీ కుష్బూకొఠారి, ఐసీడీఎస్ పీడీ అరుణకుమారి, డీఎస్‌డీఓ మంజుల, కోచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా జాతీయ ఫుట్‌బాల్ పోటీలు

● నగరంలోని ఆర్డీటీ స్టేడియంలో జాతీయ బాలికల ఫుట్‌బాల్ పోటీలు శనివారం అట్టహాసంగా నిర్వహించారు. గోవా-కేరళ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌కు కలెక్టర్ ఆనంద్ హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలు నిర్వహించడం సంతోషకరమని కలెక్టర్ తెలిపారు. పోటీల్లో 16జట్లు పాల్గొంటున్నాయి. కార్యక్రమంలో ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ సాయికృష్ణ, ఫుట్‌బాల్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

భూ సేకరణ త్వరగా పూర్తి చేయాలి: కలెక్టర్

● **అనంతపురం కలెక్టరేట్:** జిల్లాలో వివిధ ప్రాజెక్టులకు సంబంధించి భూ సేకరణ, భూ బదలాయింపు 15రోజుల్లో పూర్తి చేయాలని కలెక్టర్ ఆనంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శనివారం ఆయన జేసీ శివనారాయణశర్మతో కలిసి వివిధ ప్రాజెక్టులకు భూ సేకరణ, భూ బదలాయింపులపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులు, ప్రైవేటు పరిశ్రమలకు సంబంధించి భూ సేకరణ, భూ బదలాయింపు చేపట్టాలన్నారు. ఆయా ప్రాజెక్టులను సకాలంలో పూర్తి చేయడం ద్వారా ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఈ విషయంపై ఆయా శాఖల అధికారులు ప్రతి రోజు పర్యవేక్షించాలన్నారు. కొత్త భూ బదలాయింపు వస్తే ఎక్కడా ఫైల్ పెండింగ్ ఉండటానికి వీలులేదని, వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో డీఆర్‌ఓ మలోల, కేఆర్‌సీసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తిప్పేనాయక్, కలెక్టరేట్ ఏఓ అలెగ్జాండర్, కలెక్టరేట్ సెక్షన్ల సూపరింటెండెంట్లు యుగేశ్వరి దేవి, రియాజుద్దీన్, వసంతలత, నెడ్ క్యాప్ అధికారి కిషోర్‌కుమార్, ఏపీఐఐసీ మేనేజర్ శివమోహన్, బీఎస్ఎన్ఎల్ జేటీఎల్ రామకృష్ణ పాల్గొన్నారు.

ఫ్లాగ్‌డే సంక్షేమ నిధికి విరాళాలు ఇవ్వండి

కలెక్టర్ శ్యాంప్రసాద్

పుట్టపర్తి టౌన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): సాయుధ దళాల ఫ్లాగ్‌డే సంక్షేమ నిధికి విరివిగా విరాళాలు ఇవ్వాలని కలెక్టర్ శ్యాంప్రసాద్ ప్రజలకు పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో శనివారం ఆయన సాయుధ దళాల ఫ్లాగ్‌డే సంక్షేమ నిధికి సంబంధించిన కారు పతాకాలు, స్టిక్కర్లను జిల్లా సైనిక సంక్షేమశాఖ అధికారులతో కలిసి ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ సైనికుల సేవలకు గుర్తింపుగా పౌరసమాజం ఇచ్చే గౌరవ చిహ్నంగా ఫ్లాగ్‌డే నిర్వహించుకుంటున్నట్లు తెలిపారు. కారు ఫ్లాగ్‌లు 5000, స్టిక్కర్లు 3500 అందుబాటులో ఉంచినట్లు ఉమ్మడి జిల్లా సైనిక సంక్షేమ శాఖ అధికారి పి.తిమ్మప్ప కలెక్టర్‌కి వివరించారు. కారు ఫ్లాగ్ ఒకటి ఐదు రూపాయలుగా, స్టిక్కర్ రెండు రూపాయలుగా నిర్ణయించినట్లు తెలిపారు. ప్రజలు వీటిని విరివిగా కొనుగోలు చేయాలని సూచించారు. సాయుధ దళాల పతాక దినోత్సవానికి విరాళాలు ఇవ్వదలచినవారు జిల్లా సైనిక్ సంక్షేమ అధికారి, అనంతపురం స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా అకౌంట్ నంబర్ : 62076956433-ఐఎఫ్ఎస్‌సీ కోడ్-ఎస్‌బీఐఎన్0021438 ఖాతాకు అందించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సమాచార పౌరసంబంధాల శాఖ అధికారి సీహెచ్.పురుషోత్తం, సైనిక సంక్షేమ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో వృద్ధ ఖైదీల విముక్తికి అవకాశం

డీఎల్ఎస్ఏ కార్యదర్శి రాజశేఖర్


మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి రాజశేఖర్

కదిరి లీగల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలంగా జైలులో ఉంటున్న వృద్ధులు లోక్ అదాలత్ ద్వారా విడుదలయ్యే అవకాశం ఉందని డీఎల్ఎస్ఏ కార్యదర్శి రాజశేఖర్ అన్నారు. కదిరి సబ్ జైలును శనివారం ఆయన తనిఖీ చేశారు. సబ్ జైలులో ఉన్న ఖైదీలకు అందుతున్న భోజనం, వైద్యం, సదుపాయాలను పరిశీలించారు. వారి కోసం ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడారు. కేసులలో శిక్ష అనుభవిస్తున్న 70 ఏళ్లు దాటిన ఖైదీలకు లోక్ ఆదాలత్ ద్వారా విముక్తి లభించే అవకాశం ఉందని తెలిపారు. అలాంటివారు జైలులో ఉంటే.. జైలు అధికారికి, లేదా సందర్శనకు వచ్చే న్యాయవాదుల దృష్టికి తీసుకువెళ్లాలని సూచించారు. వారికి ఉచిత న్యాయవాదిని కోర్టు ఏర్పాటు చేస్తుందని తెలిపారు.

ముస్లింల సమస్యల పరిష్కారానికే యూజేఏసీ

ముతవల్లీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షకీల్ షఫి


మాట్లాడుతున్న కేఎం షకీల్ షఫి

అనంతపురం టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ముస్లిం సామాజికవర్గ సమస్యల పరిష్కారం కోసమే యునైటెడ్ జాయింట్ యాక్షన్ కమిటీ(యూజేఏసీ)ని ఏర్పాటు చేస్తున్నట్లు ముతవల్లీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేఎం షకీల్ షఫి పేర్కొన్నారు. జిల్లా కేంద్రం లక్ష్మీనగర్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో శనివారం సమావేశం నిర్వహించారు. సమావేశానికి షకీల్ షఫి, మేయర్ వసీం, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌస్‌మొద్దీన్, టీడీపీ ముస్లిం మైనార్టీ విభాగం నాయకుడు తాజుద్దీన్, కాంగ్రెస్ నాయకుడు దాదాగాంధీ, సీపీఐ నాయకుడు జాఫర్ హాజరయ్యారు. షకీల్ షఫి మాట్లాడుతూ ముస్లిం సామాజికవర్గ ప్రజలంతా ఏకతాటిపై నిలవాలని, ఏ ఒక్క ముస్లింకు సమస్య వచ్చిన ప్రతి ఒక్కరూ అండగా నిలవాలన్నారు. సీపీఐ నాయకుడు జాఫర్ మాట్లాడుతూ యూజేఏసీ అనేది ఒక వ్యక్తి లేదా పార్టీకి సంబంధించిన కమిటీ కాదని, ముస్లిం సామాజికవర్గం మొత్తానికి సంబంధించినదన్నారు. యూజేఏసీ జిల్లా కన్వీనర్‌గా జాఫర్‌ను ఎంపిక చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ముంతాజ్‌బేగం, ఐఎంఎం రాష్ట్ర అధ్యక్షుడు మహబూబ్‌బాషా, హెల్పింగ్ హ్యాండ్స్ షబ్బీర్, మానవ హక్కుల జాకీర్ హుస్సేన్, ఆవాజ్ వలి, ముక్తియార్, బీజేపీ మైనార్టీ మోర్చా రాష్ట్ర నాయకుడు మహమ్మద్ రఫి పాల్గొన్నారు.

కనుమరుగవుతున్న సంచార జాతులు

ప్రజా సైన్స్ వేదిక కన్వీనర్ డాక్టర్ సురేష్‌బాబు


సంచార జాతులవారితో సురేష్‌బాబు

అనంతపురం టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల సంచార జాతులు కనుమరుగవుతున్నాయని ప్రజా సైన్స్ వేదిక కన్వీనర్ డాక్టర్ ఎం. సురేష్‌బాబు పేర్కొన్నారు. ఆ వేదిక జిల్లా కార్యాలయంలో శనివారం సంచార జాతుల వారితో కలిసి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దశాబ్దాలుగా సంచార జాతులు ప్రభుత్వ పథకాల నుంచి, సామాజిక వనరుల నుంచి, రాజకీయ ప్రాతినిధ్యం నుంచి దూరంగా ఉంటున్నాయన్నారు. పలు తెగలు నేటికీ తీవ్ర నిర్లక్ష్యాన్ని ఎదుర్కొంటున్నాయన్నారు. వీటిలో కిన్నెర జోగులు ముఖ్యమైనవన్నారు. మహారాష్ట్ర నుంచి వలస వచ్చి, అనంతపురం జిల్లా కల్లూరు ప్రాంతంలోని కొన్ని గ్రామాల్లో తాత్కాలికంగా స్థిరపడిన ఈ సముదాయం ఒకప్పుడు సంప్రదాయ గాయకులు, కథకులు గా ప్రసిద్ధి చెందారని తెలిపారు. ఇపుడు వారి జీవితం అసంఘటిత కూలి పనులకు, పేదరికానికి, సామాజిక అజ్ఞానానికి పరిమితమైందని వాపోయారు. ఈ సముదాయాలకు కేవలం జీవనమే కాకుండా గౌరవప్రదమైన భవిష్యత్తు అవసరమన్నారు. వీరి సమస్యల పట్ల ప్రభుత్వం స్పందించి, వారిని సామాజికంగా, ఆర్థికంగా నిలదొక్కుకునేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పౌర స్పందన వేదిక ప్రతినిధి ప్రొఫెసర్ వెంకటశివారెడ్డి, రామాంజనేయులు పాల్గొన్నారు.

నేడూ హౌసింగ్ సర్వే

అనంతపురం వైద్యం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): పేదలకు సొంత స్థలం కేటాయింపు, కొత్త ఇల్లు మంజూరు కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన హౌసింగ్ సర్వే ప్రక్రియ ఆదివారం కూడా కొనసాగనుంది. ఈనెల 10నుంచి జిల్లాలో గృహనిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో సర్వేను నిర్వహిస్తున్నారు. శనివారం 48వేల కుటుంబాలను సర్వే నిర్వహించి దరఖాస్తులు స్వీకరించారు. ఈనెల 30వరకు ప్రభుత్వ గడువు విధించడంతో ఆదివారం సర్వే ప్రక్రియ ముగియనుంది. సర్వేలో పాల్గొనలేకపోయిన కుటుంబాలు వారి ప్రాంత సచివాలయాలకెళ్లి దరఖాస్తులు సమర్పించాలని జిల్లా గృహణ నిర్మాణ సంస్థ అధికారిణి శైలజ సూచించారు.

రేపు హ్యాండ్‌బాల్ క్రీడాకారుల ఎంపిక పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): హ్యాండ్‌బాల్ సీనియర్స్ ఉమ్మడి జిల్లా స్థాయి క్రీడాకారుల ఎంపిక పోటీలు సోమవారం ఎల్ఆర్‌జీ స్కూల్‌లో నిర్వహించనున్నట్లు జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి సాకే శివ శంకర్ తెలిపారు. క్రీడాకారులు జనన ధ్రువీకరణపత్రం, ఆధార్‌కార్డు, యునిఫాం, క్రీడాసామగ్రితో హాజరు కావాలన్నారు. వివరాలకు సెల్ నంబర్లు 8978137522, 8074793673లను సంప్రదించాలని కోరారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోండి

పెనుకొండ రూరల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు డీఆర్‌డీఏ, సీడప్ స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ సంయుక్తంగా నిర్వహిస్తున్న శిక్షణ సద్వినియోగం చేసుకోవాలని స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి లక్ష్మి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 19-26సంవత్సరాలు వయసు కలిగిన ఉమ్మడి జిల్లాకు చెందిన యువతకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. 90రోజుల శిక్షణ అనంతరం సర్టిఫికెట్ ఇవ్వనున్నారు. అనంతపురంలోని ఎస్‌కె యూనివర్సిటీలో ఆదివారం నుంచి శిక్షణ ప్రారంభం అవుతుందని ఆమె తెలిపారు.

బాబయ్య ఉరుసును విజయవంతం చేద్దాం

పెనుకొండ ఆర్డీఓ, డీఎస్పీ

పెనుకొండ టౌన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధి చెందిన పెనుకొండ బాబయ్య 753వ ఉరుసు మహోత్సవాన్ని విజయవంతం చేద్దామని ఆర్డీఓ ఆనంద్‌కుమార్, డీఎస్పీ నర్సింగప్ప పిలుపునిచ్చారు. ఉరుసు విషయంగా ఆర్డీఓ కార్యాలయంలో అన్నిశాఖల అధికారులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిసెంబరు 2 నుంచి ప్రారంభమయ్యే ఉరుసు ఉత్సవాలకు ఉమ్మడి జిల్లా నుంచే కాక ఇతర రాష్ట్రాల నుంచి అనేకమంది హాజరవుతారన్నారు. వీరికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. ఉరుసుకు వచ్చే సమయంలో 44వ జాతీయ రహదారిపై బైక్ రేసింగ్ జరగకుండా కట్టడి చేయాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ రాఘవన్, ఎస్ఐ వెంకటేశ్వర్లు, రాజేష్, కమిషనర్ సతీష్‌కుమార్, మైనార్టీ నాయకులు దాదు పాల్గొన్నారు.

క్రీడల్లో దివ్యాంగ విద్యార్థుల ప్రతిభ


బహుమతులు పొందిన దివ్యాంగ విద్యార్థులు

రామగిరి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని పేరూరు ఉన్నత పాఠశాలకు చెందిన దివ్యాంగ విద్యార్థులు క్రీడల్లో ప్రతిభ కనబరచి జిల్లాస్థాయిలో బహుమతులు గెలుపొందారు. కొత్తచెరువులోని సమగ్రశిక్ష తారా స్పోర్ట్స్ అసోసియేషన్ వారు శుక్రవారం దివ్యాంగ విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహించారు. అందులో పేరూరు పాఠశాలకు చెందిన అక్షయ, నిఖిల్ పాల్గొని షాట్‌పుట్, పరుగుపందెంలో ప్రతిభ చూపి మొదటిస్థానంలో నిలిచి బహుమతులు గెలుపొందారు. వీరిని పాఠశాల హెచ్ఎం అరవింద్ తదితరులు శనివారం అభినందించారు. పీడీలు వారాది, నరేశ్ పాల్గొన్నారు.

ఘనంగా జేఎల్ మురళీధర్ జన్మదిన వేడుకలు


కేక్‌కట్ చేస్తున్న జేఎల్ మురళీధర్

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): అర్బన్ బ్యాంకు చైర్మన్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జేఎల్ మురళీధర్ జన్మదిన వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక సుభాష్ రోడ్డులో ఉన్న శ్రీకృష్ణదేవరాయభవన్‌లో బ్యాంకు పాలకవర్గసభ్యులు, టీడీపీ నాయకులు, అభిమానుల సమక్షంలో భారీ కేక్‌ను కట్ చేశారు. తర్వాత డైరెక్టర్ మాగిశెట్టి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో స్వామి దయానంద గురుకులంలో విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీశారు. ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి వద్ద రోగులకు అన్నదానం చేశారు. సాయంత్రం వేణుగోపాల్ నగర్‌లోని మురళీధర్ నివాసం ఎదుట చిన్నారులు నృత్యప్రదర్శనలు చేశారు.

మండల సమావేశంలో సమస్యలపై చర్చ

శింగనమల, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం ఎంపీపీ యోగేశ్వరి అధ్యతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఇందులో అధికారులు, సభ్యులు మండలంలోని ప్రజా సమస్యలపై చర్చించారు. తర్వాత అధికారులు తమ శాఖలో ఉన్న సంక్షేమ పథకాల గురించి సభ్యులకు వివరించారు. ఎంపీడీఓ భాస్కర్,డిప్యూటీ తహసీల్దార్ సూర్యప్రతాప్, ఏఓ అన్వేష్‌కుమార్, ఎంఈఓ నరసింహరాజు. పీఆర్‌డీఈ కృష్ణజ్యోతి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యలపై ఎమ్మెల్యే ఆరా

రామగిరి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీతను స్వగ్రామం వెంకటాపురంలో శనివారం రామగిరి, కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి మండలాల్లోని పలు గ్రామాలకు చెందిన ప్రజలు వచ్చి కలిశారు. ఎమ్మెల్యే వారితో మాట్లాడుతూ ఆయా గ్రామాలలో సమస్యలను, జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి ఆరా తీశారు. తర్వాత కొందరు వివిధ సమస్యలపై అర్జీలను అందజేశారు. పేరూరు మహాత్మాబాలుర గురుకుల పాఠశాల ఉపాధ్యాయ బృందం మెగా పేరెంట్స్ మీటింగ్‌కు రావాలని ఎమ్మెల్యేను ఆహ్వానించారు.

సర్పంచ్ ఆరోపణలు అవాస్తవం: టీడీపీ

చెన్నేకొత్తపల్లి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి):పంచాయతీలో పనులు చేయవద్దంటూ కొందరు టీడీపీ నాయకులు తనను బెదిరిస్తున్నారని మేడాపురం వైసీపీ సర్పంచ్ రామాంజనేయులు ఆరోపించడంలో వాస్తవం లేదని స్థానిక టీడీపీ నాయకులు పేర్కొన్నారు. మేడాపురంలో శనివారం స్థానిక టీడీపీ నాయకులు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈనెల 27వతేదీన సర్పంచ్ రామాంజనేయులు టీడీపీ వారిపై పలు ఆరోపణలు చేస్తూ ధర్మవరం డీఎస్పీకి ఫిర్యాదు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. మేడాపురం పంచాయతీలో సర్పంచ్ చేసిన పనులకు సంబంధించి కూడా కూటమి ప్రభుత్వం బిల్లులు చేయడం జరిగిందన్నారు. ఇకనైనా సర్పంచ్ టీడీపీపై లేనిపోని ఆరోపణలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. నాయకులు గాలిమిషన్ నరసింహులు,పసలవెంకటేశ్, పసలజగదీశ్,పసల వెంకీ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త మృతికి నివాళి

శింగనమల, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈస్టు నరసాపురం గ్రామానికి చెందిన టీడీపీ యువ కార్యకర్త బొడిపాటి నవీన్ అనారోగ్యంతో మృతి చెందాడు. పార్టీ మండల నాయకుడు ఈశ్వర్‌రెడ్డి, కన్వీనర్ గోరంట్ల మారుతి నాయుడు తదితరులు శనివారం గ్రామానికి వెళ్లి నవీన్ మృతదేహాన్ని సందర్శించి నివా ళులర్పించారు. అలాగే అదే గ్రామంలో గుండెపోటుతో మృతి చెందిన దూదేకుల ఫక్రుద్దీన్ ఇంటి వద్దకు కూడా వెళ్లి నివాళులర్పించారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూఏ వీసీకి ఉత్తమ అవార్డు


అవార్డు అందుకుంటున్న వీసీ సుదర్శనరావు

అనంతపురంరూరల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూఏ వైస్ చాన్సలర్ సుదర్శనరావుకు ఉత్తమ అకడమిక్ అడ్మినిస్ట్రేటర్ జాతీయ అవార్డు దక్కింది. ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ఈ అవార్డును ప్రదానం చేసింది. పుదుచ్చేరిలోని శ్రీమనకుల వినాయగర్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం 55వ ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్, నేషనల్ యాన్యువల్ ఫ్యాకల్టీ కన్వెన్షన్ రీ ఇమేజనింగ్ ఎడ్యుకేషన్, 5.ఓ ఎమర్జింగ్ టెక్నాలజీ ఫర్ ఏ సస్టైనబుల్ ఫ్యూచర్ అనే అంశంపై సమ్మేళనం నిర్వహించారు. దేశవ్యాప్త విద్యావేత్తలు, ఉపకులపతులు, పరిశోధకులు, పరిశ్రమ నిపుణులు పాల్గొని వివిధ అకడమిక్ విభాగాలలో అత్యుత్తమ ప్రతిభను కనబరిచారు. దీంతో వారికి జాతీయ స్థాయి అవార్డులను అందజేశారు. ఇందులో జేఎన్‌టీయూఏ వీసీ సుదర్శనరావు 2025 ఉత్తమ అకడమిక్ అడ్మినిస్ట్రేటర్‌గా అవార్డు పొందారు. వీసీ అవార్డు పొందటం పట్ల రిజిస్ట్రార్ కృష్ణయ్య, ఓఎస్‌డీటూ వీసీ దేవన్న, యూనివర్సిటీ డైరెక్టర్లు , ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాళ్లు అభినందనలు తెలియజేశారు.

జిల్లా క్రికెట్ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా క్రికెట్ సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. స్థానిక అనంత క్రీడాగ్రామంలోని ఆడిటోరియంలో శనివారం ఎన్నికల అధికారి, విశ్రాంత ఆర్డీఓ ఈశ్వర్ సమక్షంలో ఈ ఎన్నిక నిర్వహించారు. అందులో అధ్యక్షుడిగా సీ. శ్రీనాథ్, ఉపాధ్యక్షుడిగా నూర్ మహ్మద్‌ఖాన్, కార్యదర్శిగా యుగంధర్ రెడ్డి, సహాయ కార్యదర్శిగా ఎస్. సర్దార్, కోశాధికారిగా జే మురళీకృష్ణ, కౌన్సిలర్‌గా హెచ్.అన్సార్‌ఖాన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్ అభినందించారు.



క్రికెట్ సంఘం నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న మాంచోఫెర్రర్

ఉపాధ్యాయుల క్రీడాపోటీలు ప్రారంభం

- మండలస్థాయిలో పురుషులకు క్రికెట్, మహిళలకు త్రోబాల్ పోటీల నిర్వహణ
- గెలుపొందిన వారు డివిజన్ స్థాయికి ఎంపిక


గార్లదిన్నెలో క్రికెట్ పోటీని ప్రారంభిస్తున్న ఎంఈఓ తారా చంద్రానాయక్

గార్లదిన్నె, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయిలకు ప్రభుత్వం నిర్వహించిన క్రీడాపోటీలను మండలకేంద్రంలోని మైనార్టీ పాఠశాల క్రీడా మైదానంలో శనివారం ప్రారంభించారు. ఇందులో భాగంగా క్రికెట్ పోటీని నిర్వహించగా.. ఎంఈఓలు తారా చంద్రానాయక్ ఏ- జట్టుకు, వెంకటరమణ నాయక్ బీ -జట్టుకు కెప్టెన్లుగా వ్యవహరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. క్రీడలతో మానసిక వత్తిడి దూరమవుతుందని తెలిపారు. పాఠ్యాంశాల బోధనలో నిత్యం బిజీగా ఉండే ఉపాధ్యాయులకు ఈ క్రీడాపోటీలు కొంతవరకు ఉపశమనం కలిగిస్తాయని చెప్పారు. ఈ క్రమంలో వారు మరింత ఉత్సాహంగా పని చేస్తారని పేర్కొన్నారు. అదేవిధంగా మహిళా ఉపాధ్యాయులకు త్రోబాల్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల ఉపాధ్యాయునీఉపాధ్యాయులు పాల్గొన్నారు.

●కనగానపల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయిలకు మండల స్థాయి క్రీడా పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ఇందులో ఉపాధ్యాయులకు క్రికెట్, ఉపాధ్యాయినులకు త్రోబాల్ పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారిని డివిజన్ స్థాయికి ఎంపిక చేశారు. మండలంలోని పలు పాఠశాలల ఉపాధ్యాయులు, ఎంఈఓ అరుణమ్మ, పలువురు పీఈటీలు పాల్గొన్నారు.

● అనంతపురం క్లాక్‌టవర్: అనంతపురం అర్బన్, రూరల్ మండల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులకు క్రికెట్, త్రోబాల్ పోటీలను స్థానిక న్యూటౌన్ బాలుర ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించారు. క్రికెట్ పోటీల్లో 50మంది ఉపాధ్యాయులు, త్రోబాల్ పోటీల్లో 30మంది ఉపాధ్యాయినులు పాల్గొన్నారు. వాటిల్లో గెలుపొందిన జట్ల వివరాలను పీడీలు తబిత, వేణుగోపాల్ ప్రకటించారు. ఈ జట్లు డిసెంబరు 13వ తేదీన జరిగే డివిజన్ స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు చెప్పారు.

తీరిక లేని ప్రజాప్రతినిధులు..!

- మండల సర్వసభ్య సమావేశానికి సగం మందికి పైగా డుమ్మా
- వచ్చినవారు సైతం పట్టుమని గంటసేపు ఉండని వైనం


సమావేశానికి తక్కువ సంఖ్యలో హాజరైన ప్రజాప్రతినిధులు

అనంతపురం రూరల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రజాప్రతినిధులకు సమావేశాలకు వచ్చి ప్రజా సమస్యలపై చర్చించే తీరిక కూడా లేకుండా పోయింది. రూరల్ మండల ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ వరలక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఇందులో జడ్పీటీసీ సభ్యుడు చంద్రకుమార్, ఎంపీడీఓ దివాకర్, డిప్యూటీ ఎంపీడీఓ వెంకటనాయుడు, ఇతర మండల అధికారులు హాజరయ్యారు. ప్రజాప్రతినిధులు పెద్దగా రాలేదు. మండలంలో 30మందికి పైగా ఎంపీటీసీ సభ్యులు, 20 మందికి పైగా సర్పంచులు ఉన్నారు. ఇందులో సగం మంది కూడా హాజరుకాలేదు. దీన్నిబట్టి చూస్తే ప్రజాసమస్యలపై వారికి ఏపాటి అంకితభావం ఉందో అర్థం అవుతోంది. వచ్చిన వారికి కూడా కనీసం గంటసేపు ప్రజాసమస్యలపై చర్చించే తీరికలేని పరిస్థితి కనిపించింది. సగం మందికిపైగా సమావేశం మధ్యలోనే వెళ్లిపోయారు. దీంతో ప్రజాప్రతినిధుల కుర్చీలు ఖాళీగా కనిపించాయి. అధికారులు తమ ప్రగతి నివేదికలను ఖాళీ కుర్చీలకు చెప్పుకోవాల్సి వచ్చింది. ఇదిలా ఉండగా.. సమావేశంలో రెవెన్యూ, విద్యుత్ శాఖల అధికారులు, సిబ్బంది లేకపోవడం పట్ల వచ్చిన అరకొర ప్రజాప్రతినిధులు అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామాల్లో ఎక్కువగా రెవెన్యూ, విద్యుత్ శాఖకు సంబంధించిన సమస్యలే ఉంటున్నాయని, వాటిని చెప్పుకునేందుకు అధికారులే లేకపోతే ఎలా అంటూ మండిపడ్డారు.

ఆంధ్రజ్యోతి కథనంపై చర్చ...


ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనాన్ని చూపుతున్న మన్నీల సర్పంచు

మన్నీల గ్రామంలో చెరువు కట్టకు డీపట్టా ఇవ్వడంపై రెండు రోజుల కిందట ఆంధ్రజ్యోతిలో కట్టబెట్టారు అన్న శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై సంబంధిత అధికారులపై గ్రామ సర్పంచు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. జిల్లా ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి కట్టను తొలగించవద్దని సూచించినా.. డీ పట్టాదారుడు కట్టను చదును చేయడం జరిగిందన్నారు. రెవెన్యూ అధికారుల తప్పిదాలతో స్థానిక రైతులు ఇబ్బందులు పడటంతోపాటు, నీటి వనరులను కోల్పోవాల్సి వస్తోందని అసహనం వ్యక్తం చేశారు. విద్యుత్ అధికారుల తీరుకూడా ఇదేవిధంగా ఉందన్నారు. కొన్ని నెలలుగా గ్రామంలో విద్యుత్ స్తంభం దెబ్బతిందని, మార్చమని కోరుతున్నా పట్టించుకోవడం లేదని వాపోయారు. అధికారులు సమస్యలను పట్టించుకోకపోవడంతో గ్రామాల్లో సర్పంచులు డమ్మీలుగా మారిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు.

ముస్లింల అభివృద్ధికి కృషి: ఎమ్మెల్యే పరిటాల సునీత


బీటీరోడ్డు శిలా ఫలకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

ఆత్మకూరు నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ముస్లింల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. ప్రభుత్వం, వక్ఫ్ బోర్డు ద్వారా నిధులను సమకూరుస్తున్నామని తెలిపారు. రైతన్నా మీకోసం కార్యక్రమంలో పాల్గొనేందుకు పి.కొత్తపల్లికి వచ్చిన ఎమ్మెల్యేని ముస్లింలు కలిశారు. మసీదుల్లో పనిచేసే ఇమామ్‌లు, మౌజన్‌లక గౌరవ వేతనం అందజేయడం హర్షణీయమని ఎమ్మెల్యేకి వారు కృతజ్ఞతలు తెలిపారు. తమ మండలంలో ఒక్కో మసీదుకు రూ.1.80 లక్షలు చొప్పున మూడు మసీదులకు నిధులు మంజూరు చేయడం సంతోషకరమని అన్నారు. గ్రామంలో తరతరాలుగా ఉన్న ప్రహరీ సమస్య పరిష్కరించారని, కమ్యూనిటీ భవనం నిర్మాణాన్ని పూర్తి చేశారని ధన్యవాదాలు తెలిపారు. పి.కొత్తపల్లిలో వాల్మీకి విగ్రహం ఏర్పాటుకు ఎమ్మెల్యే పరిటాల సునీత రూ.లక్ష విరాళం ఇచ్చారు. మహిళా సంఘాల ద్వారా అమలవుతున్న 'మన డబ్బులు.. మన బ్యాంకు' కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అలాగే కొత్తగా నిర్మించిన బీటీ రోడ్డుకు సంబంధించిన శిలాఫలకాన్ని, బస్ షెల్టర్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ మండల ఇన్‌చార్జి బాలాజీ, మండల కన్వీనర్, విభిన్న ప్రతిభావంతుల కార్పొరేషన్ చైర్మన్ నారాయణస్వామి, సొసైటీ చైర్మన్ కృష్ణమోహన్ చౌదరి, సర్పంచ్ వరలక్ష్మి, టీఎన్ఎస్ఎఫ్ నాయకుడు పరశురామ్, నాయకులు శశాంక చౌదరి, సురేంద్ర, హనుమప్ప చౌదరి, వెంకటేసులు, ఉమాపతి, సీతయ్య, గుజ్జుల ఆనంద్, సాకే ఓబులేసు, ఎర్రిస్వామి, నారాయణ, హరి, కిష్టప్ప తదిరులు పాల్గొన్నారు.

మ్యాపింగ్‌కు నేడే చివరి రోజు

శింగనమల, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో స్థలాలు ఉండి ప్రభుత్వ ఇంటి కోసం దరఖాస్తు చేసేందుకు గాను మ్యాపింగ్‌కు ఆదివారం చివరి రోజు అని , అర్హులు ఉంటే ఇంటి కోసం సొంత స్థలం వద్ద సచివాలయ డిజిటల్ అసిస్టెంట్‌తోకానీ హౌసింగ్ సిబ్బందితో మ్యాపింగ్ చేయించుకోవాలని హౌసింగ్ ఏఈ నామాల శ్రీనివాసులు శనివారం ప్రకటనలో తెలిపారు. సొంత స్థలం ఉన్న వారికి ప్రధాన మంత్రి యోజన పథకంలో వచ్చే ఇళ్లకు రూ.2.50 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం కింద వచ్చే ఇళ్లకు రూ.1.50 లక్షలు వస్తాయని చెప్పారు. తెల్ల రేషన్ కార్డు ఉన్నవారు. గత 10 ఏళ్లలో ప్రభుత్వం నుంచి ఎలాంటి గృహం పొందని వారు అర్హులని చెప్పారు.

రిటైర్డ్ అధికారి నాగరాజుకు ఘన సన్మానం


నాగరాజు దంపతులను సన్మానిస్తున్న డీపీఓ తదితరులు

అనంతపురం న్యూటౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పంచాయతీ కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా ఉన్న నాగరాజు రిటైర్డ్ అవడంతో ఆ కార్యాలయ ఆవరణంలోనే శనివారం ఆయనకు తోటి ఉద్యోగులు సిబ్బంది ఘన సన్మానం చేశారు. డీపీఓ నాగరాజనాయుడు, డీఎల్‌పీఓ విజయ్‌కుమార్, డీపీఆర్‌సీ జిల్లా కో-ఆర్డినేటర్ సౌజన్య తదితరులు హాజరై పూలమాలలు, శాలువాలతో నాగరాజు దంపతులను ఘనంగా సత్కరించారు. అనంతరం మాట్లాడుతూ విధి నిర్వహణలో నిబద్ధతకు మారుపేరు నాగరాజు అని కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆనంద్, డిప్యూటీ ఎంపీడీఓలు వెంకటనాయుడు, అశ్వర్థనాయుడు, నరసింహారెడ్డి, అశోక్‌కుమార్, విజయ్‌కుమార్, ఉషాశ్రీ, సీనియర్ అసిస్టెంట్లు భారతి, షాలినీ, జూనియర్ అసిస్టెంట్లు ఉషారాణి, సాయి పాల్గొన్నారు.

తైక్వాండోలో సురేంద్ర తడాఖా


సురేంద్రను సన్మానిస్తున్న డీపీఓ నాగరాజ నాయుడు

అనంతపురం న్యూటౌన్/ రూరల్: నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జాతీయ తైక్వాండో పోటీల్లో అనంతపురం రూరల్ మం డలం కొడిమి గ్రామ పంచాయతీ కార్యదర్శి సురేం ద్ర కాంస్య పతకాన్ని సాధించారు. ఈనెల 21నుంచి 23వ తేదీ వరకు ఉత్తరప్రదేశ్ రాయబరేలీలో జరిగిన జాతీయ తైక్వాండో చాపింయన్ షిప్-2025లో ఆయన పాల్గొన్నారు. ఆయనను డీపీఓ నాగరాజ నాయుడు తన కార్యాలయంలో శనివారం సత్కరించారు. ఈఓఆర్డీలు వెంకటనాయుడు, అశోక్‌బాబు, నరేంద్రరెడ్డి, హిదయతూల్లా తదితరులు అభినందనలు తెలిపారు.

సేవ్ గర్ల్ చైల్డ్ పోస్టర్ల ఆవిష్కరణ

అనంతపురం టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : స్థానిక అమ్మ సంస్థ కార్యాలయంలో ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు తరిమెల రమణారెడ్డి అధ్యక్షతన సేవ్ గర్ల్ చైల్డ్ పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా ఏఎస్పీ ఆర్ల శ్రీనివాసులు హాజరై పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ... భూమిపై మానవ జాతి ఉనికిలో పురుషుడికన్నా స్త్రీ చాలా అవసరమని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదన్నారు. ఎందుకంటే సృష్టికి మూలం స్త్రీనే కాబట్టి మానవ జాతి కొనసాగింపుకోసం ఆడపిల్లలను రక్షించి, గౌరవించి, సమాన అవకాశాలు, హక్కులు కల్పించి ముందుకు సాగనివ్వాలని సూచించారు. సంస్థ అధ్యక్షుడు రమణారెడ్డి మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ ఆడపిల్లలను రక్షించుకోవడం బాధ్యతగా భావించాలని తెలిపారు. కార్యక్రమంలో కార్డియాలజిస్ట్ వంశీకృష్ణ, పల్మనాలజిస్ట్ కోనా మురళీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన రామకృష్ణ విశ్వజనీన ఆలయ ప్రారంభ పూజలు


పూర్ణాహుతి హోమం నిర్వహిసుర్తన్న స్వామీజీ

అనంతపురం టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని హెచ్చెల్సీ కాలనీలో రామకృష్ణ విశ్వజనీన ఆలయ ప్రారంభోత్సవ వేడుకలు మూడో రోజున శనివారమూ కొనసాగాయి. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో స్వామి విమలాత్మానందజీ మహరాజ్ నేతృత్వంలో వేదపండితులు వేద మంత్రోచ్చారణల నడుమ హోమాది క్రతువులు నిర్వహించి పూర్ణాహుతి గావించారు. అలాగే రామకృష్ణ పరమహంసతోపాటు వివేకానందుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం శ్రీ 7 కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో చిన్నారులు సంప్రదాయ నృత్యప్రదర్శనలతో అలరించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీధరమూర్తి, ప్రత్యూష, గంగాధర, విద్యార్థులు, భక్తులు పాల్గొన్నారు.

చెరువులకు నీరు విడుదల చేయాలి

అనంతపురం విద్య, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పీఏబీఆర్ కుడికాలువ, సుబ్బరాయసాగర్ గేట్లను ఎత్తి చెరువులకు నీరు విడుదల చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి, సీపీఐ నాయకుడు మల్లికార్జున కోరారు. ఈ మేరకు శనివారం ఆయన స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆనంద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పీఏబీఆర్ ఎంపీఆర్, సుబ్బరాయసాగర్‌లో గేట్లు మొరాయించడం వల్ల దిగువకు నీరు వదలలేని పరిస్థితులు ఏర్పడ్డాయిని, వెంటనే ఆ గేట్లను మరమ్మతులు చేయించి నీటిని వదిలేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. రైతు సంఘం నాయకులు నారాయణస్వామి, బండి రామక్రిష్ణ, రమణయ్య, కృష్ణుడు నరేష్, దుర్గాప్రసాద్, రాముప్రసాద్ పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామికి భస్మ గంధాధివాసం


భస్మ గంధాధివాసంలో స్వామి మూలవిరాట్

అనంతపురం టౌన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): రామ్‌నగర్ 80 అడుగుల రోడ్డులోని అయ్యప్పస్వామి ఆలయంలో విగ్రహ పునః ప్రతిష్ఠ వేడుకల్లో భాగంగా శనివారం ఉదయం అర్చకులు స్వామివారి మూలవిరాట్‌కు భస్మ, గంధాధివాసం నిర్వహించారు. అలాగే ఆలయ ఆవరణలో వేదమంత్రోచ్చారణల నడుమ మహానారాయణ పఠనం, పూర్వక నవగ్రహ నారాయణ హోమం, ఆవాహిత దేవతా హోమాలు నిర్వహించి పూర్ణాహుతి గావించారు. సాయంత్రం స్వర్ణకవచ సహిత అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆదివారం తెల్లవారుజామున 4.35 గంటలకు స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ , సాయం త్రం మహా పడిపూజ నిర్వహించనున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు హరినాథరెడ్డి, ఉపాధ్యక్షులు నెట్టెం సూర్యనారాయణ, కేవీ నారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎల్ఐసి సూర్యనారాయణ, కార్యదర్శి సివిల్ సప్లయ్స్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎస్టీ కమిషన్ సభ్యుడు


కలెక్టర్‌తో ఎస్టీ కమిషన్ సభ్యుడు వెంకటప్ప

అనంతపురం క్రైం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఎస్టీ కమిషన్ సభ్యుడు వెంకటప్ప కలెక్టర్ ఆనంద్‌ను శనివారం కలిశారు. స్థానిక కలెక్టరేట్‌లో శనివారం ఆయన కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి, శాలువ కప్పి సత్కరించారు. తర్వాత పలు అంశాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రాయల్ మురళి, తెలుగుయువత రాష్ట్ర అధికార ప్రతినిధి లక్ష్మీనరసింహ, ఎస్టీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి వీరాంజినేయులు పాల్గొన్నారు.

కేజీబీవీలో అవగాహన సదస్సు

గార్లదిన్నె, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని కేజీబీవీలో శనివారం బాలికల రక్షణ, విద్య, హక్కులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందుకు ఐసీడీఎస్ పీడీ అరుణకుమారి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బాలికలు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ప్రతిఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. అలాగే బాల్యవివాహాల వల్ల కలిగే నష్టాలను వివరించి వాటి నిర్మూలనకు పాటు పడాలని సూచించారు. ఎంపీడీఓ యోగానందరెడ్డి, ఎస్ఐ సురేంద్రబాబు మాట్లాడుతూ.. బాలికలు ప్రమాదకర సోషల్ మీడియాల కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు. ఎవరైనా వేధింపులకు గురి చేస్తే వెంటనే 112, 100, 1098 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగసత్య, సూపర్‌వైజర్ శ్రీవాణి, చైల్డ్‌లైన్ జిల్లా సమన్వయకర్త కృష్ణమాచారి తదితరులు పాల్గొన్నారు.

పద.. ఆస్పత్రికి పోదాం..!

గాయపడిన కుక్కపిల్లకు చికిత్స చేయించిన కానిస్టేబుల్


కుక్కపిల్లకు చికిత్స చేయిస్తున్న కానిస్టేబుల్ రామాంజనేయులు

శింగనమల, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్ సమీపంలో కాలికి గాయమై నడవలేక ఇబ్బంది పడుతున్న కుక్కపిల్లకు స్థానిక ఓ కానిస్టేబుల్ చికిత్స చేయించి మానవత్వం చాటుకున్నారు. స్థానిక పోలీస్ స్టేషన్ సమీపంలో శనివారం ఓ వాహనం వీధి కుక్క పిల్ల కాలు మీద వెళ్లింది. దీంతో తీవ్రగాయమవడంతో అది నడవలేక ఇబ్బంది పడుతోంది. గమనించిన కానిస్టేబుల్ రామాంజనేయులు వెంటనే కుక్కపిల్లను సమీపంలోని పశువైద్యశాలకు తీసుకెళ్లారు. అక్కడ పశువైద్యుడు పద్మనాభయ్య దాని కాలికి సర్జరీ చేశారు. మూగజీవాలపై మానవత్వం చూపడంతో కానిస్టేబుల్ రామాంజనేయులును గ్రామస్థులు అభినందించారు.

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

చెన్నేకొత్తపల్లి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): రామగిరి మండలం మంగాపురంలో అంగన్‌వాడీ ఆయా ఇంద్రజపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం మండలకేంద్రంలో సీడీపీఓ కవితాదేవిని కలిసి వినతిపత్రం అందజేశారు. యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సీఎస్ శ్రీదేవి, వి.శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోండి

శింగనమల, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో 18 ఏళ్ల వయసు నిండిన వారు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని శింగనమల నియోజకవర్గం ఎన్నికల ప్రత్యేక అధికారి మల్లికార్జునుడు సూచించారు. మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన రాజకీయ పార్టీల నాయకుల సమావేశంలో ఆయన ఈ విషయం చెప్పారు. తహసీల్దార్ శ్రీధర్‌మూర్తి, డిప్యూటీ తహసీల్దార్ సూర్యప్రతాప్ ,ఎంపీడీఓ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

వైభవంగా పల్లకి సేవ


స్వామివారి పల్లకిని ఊరేగిస్తున్న భక్తులు

ఉరవకొండ, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శనివారం స్వామివారికి పల్లకిసేవను వైభవంగా నిర్వహించారు. స్వామి వారి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, పూజలను చేశారు. అనంతరం ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలతో అలంకరించి, పల్లకిలో ఆలయం చుట్టూ ఊరేగించారు.

నేమకల్లు అంజన్నకు పూజలు



బొమ్మనహాళ్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి) మండలంలోని నేమకల్లు ఆంజనేయ స్వామికి శనివారం విశేష పూజలు జరిగాయి. ప్రధాన అర్చకుల అనిల్‌కుమార్ చార్యులు పూజలు నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం, వెండి కవచం, పుష్పాలంకరణ చేసి నైవేద్యం సమర్పించిన అనంతరం మహామంగళారతి ఇచ్చారు. ధర్మకర్త ఎస్వీ త్రినాథ్, మాజీ ధర్మకర్తలు కాశీనాథ్‌శెట్టి, వన్నూరుస్వామి, శాంతయ్య, దేవదాయశాఖ అధికారి ఓబన్న, హనుమంతరెడ్డి పాల్గొన్నారు.

మురడిలో..



డీ.హీరేహాళ్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని మురడి గ్రామంలో వెలిసిన ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆలయంలోని అర్చకులు తెల్లవారుజామునే ఆలయాన్ని శుద్ధి చేసి పూజలు నిర్వహించారు. సుప్రభాత సేవతో స్వామివారికి పూజలు చేపట్టారు. కుంకుమార్చన, బిల్వార్చన, సహస్రనామార్చన చేపట్టారు. ఆలయానికి వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

రంగనాథస్వామికి..



తాడిపత్రి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆలూరుకోనలో శ్రీదేవిభూదేవి సమేత రంగనాథ స్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి మూలవిరాట్‌కు అభిషేకాలు, అర్చనలు పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

ఘనంగా ఆంజనేయస్వామి రథోత్సవం


పురవీధుల్లో ఊరేగుతున్న రథం

గుమ్మఘట్ట, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగచేడు గ్రామంలో శనివారం ఆంజనేయస్వామి రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వేకువజామునే స్వామివారికి అభిషేకం నిర్వహించి రథోత్సవాన్ని నందికోలాటాల మధ్య పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం గుడికి చేర్చారు. సమీప గ్రామాల ప్రజలు, భక్తులు పాల్గొని స్వామివారికి ప్రత్యేకపూజలు జరిపించారు.

విగ్రహ ప్రతిష్ఠ పూజలు

బొమ్మనహాళ్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీధరఘట్ట గ్రామంలో గ్రామ దేవతలు మాతా మారెమ్మ, గౌరమ్మ దేవి విగ్రహాల ప్రతిష్ఠపన పూజలు శనివారం ప్రారంభించారు. ఉదయం గంగాజలాన్ని తీసుకోచ్చి కలశపూజ, గణపతిపూజ, పుణ్యాహావాచనము, కంకణధారణము, పంచగవ్య, ప్రధాన కలశములకు పూజలు నిర్వహించారు. సాయంత్రం గ్రామంలో విగ్రహాలను ఊరేగింపు నిర్వహించారు. ఆదివారం గ్రామ దేవతల విగ్రహాలను ప్రతిష్ఠించనున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు.

చౌడేశ్వరి ఆలయానికి విద్యుత్ సౌకర్యం

విడపనకల్లు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని గడేకల్లు గ్రామంలో కొం డపై వెలిసిన చౌడేశ్వరి అమ్మవారి ఆలయానికి, గ్రామంలోని భీమలింగేశ్వర ఆలయానికి పయ్యావుల సోదరుల సహకారంతో విద్యుత్ సౌకర్యం కల్పించారు. కొన్నేళ్లుగా ఆలయాలకు విద్యుత్ సౌకర్యం లేకపోవటంతో విషయాన్ని మంత్రి పయ్యావుల కేశవ్, టీడీపీ నాయకుడు పయ్యావుల శ్రీనివాసులు స్థానిక నాయకులు తెలపడంతో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని సూచించారు. గ్రామంలోని టీడీపీ నాయకులు కొండపైకి విద్యుత్ స్తంభాలు ఏర్పాటును రెండు రోజుల్లో పనులు పూర్తి చేయించారు.

స్థానిక ఎన్నికల్లో టీడీపీ జెండా ఎగరాలి

గుంతకల్లుటౌన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): రాబోయే మున్సిపల్, సర్పంచు, ఎంపీటీసీ ఎన్నికల్లో టీడీపీ జెండా ఎగరాలని ఆ పార్టీ ఇన్‌చార్జి గుమ్మనూరు నారాయణస్వామి, కార్యనిర్వహక కార్యదర్శి రామ్మోహన్ చౌదరి, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ పురుషోత్తం అన్నారు. స్థానిక టీడీపీ క్యాంపు కార్యాలయంలో శనివారం క్లస్టర్ యూనిట్, బూత్‌స్థాయి నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. పట్టణ అధ్యక్షుడు గుణశేఖర్, సింగిల్ విండో చైర్మన్ మస్తానప్ప, ఆమ్లెట్‌మస్తాన్ యాదవ్, రామన్నచౌదరి, కృపాకర్ పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలు పెంపొందించాలి

పెద్దవడుగూరు, నవంబరు29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంపొందించాలని డైట్ అధ్యాపకుడు లక్ష్మీనారాయణ, ఎంఈఓ గురుప్రసాద్ అన్నారు. విద్యా ప్రమాణాలు పెంచేందుకు కూటమి ప్రభుత్వం ఫౌండేషనల్ లిటరసీ, న్యూమరసి బేస్‌లైన్ సర్వేలో భాగంగా శనివారం దిమ్మగుడి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను వారు పరిశీలించారు. హెచ్ఎం తస్లీమా, సీఆర్పీ రామాంజనేయులు పాల్గొన్నారు.


విద్యార్థినితో మాట్లాడుతున్న డైట్ సిబ్బంది

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం: ఎమ్మెల్యే గుమ్మనూరు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

పామిడి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం అన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో శనివారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక(ప్రజాదర్బార్) నిర్వహించారు. ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. అప్పటికప్పుడే కొన్ని సమస్యలపై జిల్లాస్థాయి అధికారులతో మాట్లాడారు. ఎద్దులపల్లి గ్రామంలో ఇందిర్మ హయాంలో పక్కాగృహాలతో పాటు ఇళ్ల పట్టాలు అందజేశారన్నారు. ఆర్టీసీ బస్టాండ్‌కు కేవలం గుత్తి, గుంతకల్లు డిపో బస్సులు మాత్రమే వస్తున్నాయని, ఇతర డిపోల బస్సులు హైవేలోనే వెళ్తున్నాయని పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. పలు గ్రామీణ ప్రాంతాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం, ఇళ్ల స్థలాలు, పట్టాలు, పింఛన్లు మంజూరుకు వినతులు అందాయి. టీడీపీ మండల ఇన్‌చార్జి గుమ్మనూరు ఈశ్వర్, తహసీల్దార్ షర్మిల, ఎంపీడీఓ తేజోత్స్న, డిప్యూటీ ఎంపీడీఓ అశ్వత్థామ నాయుడు, కూటమి నాయకులు పాల్గొన్నారు. మూడు చక్రాల బండి ఇప్పించాలని దివ్యాంగురాలు శిరీష ఎమ్మెల్యేను కోరగా బ్యాటరీతో నడిచే బండి మంజూరయ్యే చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. పట్టణంలోని ప్రభుత్వాసుపత్రికి రెండు బాడీ ఫ్రీజర్లు వితరణ చేస్తామని పీఆర్‌కే బాబు ప్రకటించడంపై ఎమ్మెల్యే ఆయనను అభినందించారు.

చంద్రన్నతోనే రైతన్న సంక్షేమం: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతోనే రైతన్న సంక్షేమం సాధ్యపడుతోందని గుంతకల్లు శాసనసభ్యులు గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో శనివారం రైతు సంక్షేమంలో మనమంచి ప్రభుత్వం కరపత్రాలను టీడీపీ మండల ఇన్‌చార్జి గుమ్మనూరు ఈశ్వర్‌తో కలిసి విడుదల చేశారు. ఏఓ విజయకుమార్, పీ కొత్తపల్లి సహకార బ్యాంకు చైర్మన్ బొల్లు శ్రీనివాస రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ


బాధితుడికి చెక్కు అందజేస్తున్న విప్ కాలవ శ్రీనివాసులు

రాయదుర్గంరూరల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ ఆస్పత్రుల్లో శస్త్రచికిత్సలు, ఆరోగ్య పరీక్షలు చేయించుకున్న వారికి శనివారం సీఎం సహాయనిధి చెక్కులను ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు తన నివాసంలో పంపిణీ చేశారు. 33 మందికి రూ.19 లక్షలను ఆయన అందజేశారు. ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం కాపాడడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు.

ఎక్సైజ్ చెక్‌పోస్టుల తనిఖీ

విడపనకల్లు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని విడపనకల్లు, డొనేకల్లు ఎక్సైజ్ చెక్‌పోస్టులను అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రేవతి శనివారం తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ చెక్‌పోస్టు అధికారులు కర్ణాటక నుంచి వచ్చే వాహనాలను నిశితంగా పరిశీలించాలని ఆదేశించారు. ఉరవకొండ సీఐ రవిచంద్ర, చెక్‌పోస్టు అధికారులు బ్రహ్మయ్య, వీరాస్వామి పాల్గొన్నారు.

యాడికి సీఐగా శ్రీనివాసులు

యాడికి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): యాడికి యూపీఎస్ సీఐగా ఆర్.శ్రీనివాసులును నియమిస్తూ ఎస్పీ కార్యాలయం నుంచి శనివారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ఇక్కడ సీఐగా పనిచేస్తున్న ఈరన్న 27న వీఆర్‌కు వెళ్లారు. యాడికి సీఐగా శ్రీనివాసులును నియమిస్తూ ఎస్పీ జగదీష్ ఉత్తర్వులు ఇచ్చారు.

కూటమి పాలనలోనే రైతుల అభివృద్ధి

కణేకల్లు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): కూటమి పాలనలోనే రైతులకు అన్ని విధాలుగా లబ్ధి చేకూరుతోందని ఆ పార్టీ నాయకులు పేర్కొన్నారు. శనివారం మండలంలో రైతన్నా మీ కోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. నాయకులు వన్నారెడ్డి, లాలెప్ప, ఆనంద్, సుదర్శన్, నవీన్, శరభనగౌడ్, జయరాంచౌదరి, ప్రభాకర్, హరి, విజయ్, అశోక్, ఎల్లప్ప పాల్గొన్నారు.

సోలార్ పరికరాల చోరీ

యల్లనూరు, నవంబరు29(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో రైతులు మొక్కజొన్న పంటలకు వేసుకొన్న సోలార్ పరికరాలు శుక్రవారం రాత్రి చోరీకి గురయ్యాయి. చిత్రావతి నది సమీపంలో దొడ్లో ఆనందు, కోలాటం రాజేష్ పొలాల్లో మొక్కజొన్నను అడవి పందుల నుంచి రక్షించేందుకు సోలార్ పరికరాలను ఏర్పాటు చేసుకున్నారు. శనివారం ఉదయం పొలాలకు వెళ్లి చూడగా వైరు మాత్రం అలాగే ఉంచి పరికరాన్ని ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. వీటివిలువ రూ.20వేలు ఉంటుందని రైతులు తెలిపారు.

కమ్మూరులో పట్టపగలే..

కూడేరు, నంబవరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కమ్మూరు గ్రామంలో ఈడిగ భీముడు ఇంట్లో పట్టపగలే చోరీ జరిగింది. బాధితుడు తెలిపిన మేరకు శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో దొంగలు ఇంట్లో చొరబడి బీరువాలోనున్న ఆరున్నర తులాల బంగారు ఆభరణాలు చోరీ చేసినట్లు తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

తాగునీటి కొళాయిల ఏర్పాటు

రాయదుర్గంరూరల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్రవన్నూరు గ్రామంలో ప్రజల సౌకర్యార్థం తాగునీటి కొళాయిలను ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ కొండన్న పేర్కొన్నారు. మండలంలోని వడ్రవన్నూరు సర్పంచ్ అశోక్ ఆధ్వర్యంలో శనివారం ఎంపీడీఓ కొళాయిలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో తాగునీటి సమస్య ఎక్కువగా ఉండటంతో విప్ కాలవ శ్రీనివాసులు ఆదేశాల మేరకు 15వ ఆర్థిక సంఘం నిధులతో 154 తాగునీటి కొళాయిలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పంచాయతీ సెక్రెటరీ ప్రతాప్‌రెడ్డి, ఉప సర్పంచ్ ఓబులేష్, తిప్పేస్వామి, అమ్రేష్, చిరంజీవి, పురుషోత్తం పాల్గొన్నారు.

పవర్ ట్రాన్స్‌మిషన్ ఏర్పాటుకు స్థల పరిశీలన

తాడిపత్రి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): అదానీ పవర్ ట్రాన్స్‌మిషన్ వారు ఏర్పాటు చేస్తున్న టవర్ విషయమై మండలంలోని వెలమకూరు, శిరిగేపల్లి గ్రామాల రైతులతో శనివారం తహసీల్దార్ సోమశేఖర్, సిబ్బంది, ఏపీ ట్రాన్స్‌కో, సోలార్ సిబ్బంది సమావేశమయ్యారు. రైతులతో మాట్లాడుతూ టవర్స్ ఏర్పాటు చేయడం వల్ల మీకు ఏమైనా అభ్యంతరాలు ఉంటే మా దృష్టికి తీసుకురావాలని కోరారు. వారు కొద్దిరోజులు గడువు ఇవ్వాలని రైతులంతా మాట్లాడి ఒక నిర్ణయానికి వచ్చిన తర్వాత నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

ఘనంగా ఫుడ్ ఫెస్టివల్

శెట్టూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక కస్తూర్బా పాఠశాలలో శనివారం ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించినట్లు పాఠశాల ప్రత్యేకాధికారి లలిత తెలిపారు. ఇందులో సేంద్రియ పద్ధతులతో తృణధాన్యాలతో వంటకాలు తయారు చేసినట్లు తెలిపారు. తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి

పుట్లూరు, నవంబరు29(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోమటికుంట్ల గ్రామానికి చెందిన చిన్న రామాంజనేయులుపై అదే గ్రామానికి చెందిన విశ్వనాథ్ దాడిచేసినట్లు శనివారం పోలీసులు తెలిపారు. రామాంజనేయులు తన తోట వద్దకు బైక్‌పై వెళ్లి ఇంటికి తిరిగి వస్తుండగా గ్రామశివారులోని చెరువు వద్ద అకారణంగా విశ్వనాథ్ అనే వ్యక్తి అడ్డగించి దాడి చేశారన్నారు. బాధితుడి ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేశామన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

గుంతకల్లు మండలంలోని పాతకొత్తచెరువు గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసినట్లు రూరల్ ఎస్ఐ రాఘవేంద్రప్ప శనివారం తెలిపారు. వారిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.10,300 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

మట్కా బీటర్లు..

తాడిపత్రి, నవంబరు29(ఆంధ్రజ్యోతి): మండలంలోని గన్నెవారిపల్లికాలనీ రాముని గుడి సమీపంలో మట్కానిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో ఎస్ఐ ధరణీబాబు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. దాడుల్లో నందలపాడు కమ్యూనిస్ట్ కొట్టాలకు చెందిన గోవర్ధన్, పుట్లూరు మండలం కందికాపులకు చెందిన రామాంజనేయులును అరెస్ట్ చేసి వారి నుంచి రూ.34వేలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

వజ్రకరూరు(ఉరవకొండ), నవంబరు 29(ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండలంలోని రాగులపాడు పంప్‌హౌస్ వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం శనివారం లభ్యమైంది. పంప్‌హౌస్ వద్ద నీటిలో తేలియాడుతూ మృతదేహం కనిపించగా స్థానికులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడు ఎరుపు రంగు డిజైన్ షర్టు, గ్రీన్ కలర్ ప్యాంటు వేసుకున్నాడన్నారు. కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

గుంతకల్లుటౌన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి):మండలంలోని మొలకలపెంట గ్రామానికి చెందిన చంద్ర అనే వ్యక్తి కడుపునొప్పి తాళలేక శనివారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కసాపురం పోలీసులు తెలిపిన మేరకు చంద్ర గత కొన్నిరోజుల నుంచి కడుపునొప్పితో బాధపడుతున్నాడన్నారు. శనివారం కడుపునొప్పి అధికం కావటంతో పొలంలో పురుగుల మందు తాగి అపస్మారకస్థితిలో పడి ఉన్నాడన్నారు. గమనించిన తోటి రైతులు చికిత్స నిమిత్తం అతనిని గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మహిళాపై ఫిర్యాదు

గుంతకల్లుటౌన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఇళ్ల స్థలాలు, రుణాలు ఇప్పిస్తానాని నగదు, బంగారం నగలు తీసుకుని మోసం చేసిందని పలువురు మహిళలు శనివారం రాత్రి కసాపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితులు తెలిపిన మేరకు వజ్రకరూరు మండలం పందికుంటకు చెందిన జోగిని నాగలక్ష్మి జోగిని ట్రస్టు ద్వారా మహిళలకు రూ.2 లక్షలు రుణాలు ఇస్తామని, రూ.లక్ష సబ్సిడీ అని చెప్పి 15 మంది మహిళలతో ఒక్కొక్కరితో రూ.15వేలు వసూలు చేసిందన్నారు. బంగారం నగలు తాకట్టు పెడితే ఇళ్ల స్థలాలు ఇస్తామని నగలు తీసుకుందన్నారు. అమ్మవారికి పూజలు చేయాలని 11 పొటేళ్లను, 20కోళ్లను తీసుకుందన్నారు. డబ్బులు అడిగితే ముఖం చాటేస్తోందన్నారు. ఆమె చేతిలో మోసపోయామని గ్రహించి స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. పోలీసులు న్యాయం చేయాలని బాధితులు లక్ష్మీదేవి, శాంతి, మహిళలు వేడుకున్నారు.


వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు

గుత్తి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు గాయపడ్డారు. పట్టణంలోని పత్తికొండ రోడ్డు విద్యుత్ కార్యాలయం ఎదుట శనివారం ఆటో, బైక్ ఢీకొన్న ఘటనలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. బేతంచెర్లకు చెందిన యువరాజు, మదనపల్లికి చెందిన శ్యామ్ స్థానిక రైల్వే స్టేషన్‌లో రైలు దిగి లచ్చానుపల్లి రోడ్డులోని బైబిల్ మిషన్ చర్చికి ఆటోలో వెళ్తుండగా విద్యుత్ కార్యాలయం వద్దకు రాగానే ఎదురుగా బైక్ రావడంతో ఆటో ఢీకొంది. ఇందులో ప్రయాణిస్తున్న యువరాజు, శామ్యూల్, ఆటో డ్రైవర్ కిషోర్ గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. యువరాజు పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురానికి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సెక్యూరిటీ గార్డుకు గాయాలు..

కళ్యాణదుర్గం(ఆంధ్రజ్యోతి): మండలంలోని సీబాయి వద్ద ద్విచక్రవాహనం ఎడ్లబండిని ఢీకొనడంతో బ్యాంకులో పనిచేసే సెక్యూరిటీ గార్డు శంకర్‌నాయక్‌కు గాయాలైన ఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు ఆత్మకూరు కెనరా బ్యాంకులో సెక్యూరిటీ గార్డుగా శంకర్ నాయక్ పని చేస్తున్నాడు. అయితే విధులు ముగించుకుని ఆత్మకూరు నుంచి కళ్యాణదుర్గానికి తన ద్విచక్రవాహనంలో తిరిగి వస్తున్నాడు. సీబాయి వద్ద ఎదురుగా వస్తున్న ఎడ్లబండిని ఢీకొన్నాడు. గాయపడిన అతనిని వెంటనే స్థానికులు 108కు సమాచారం అందించడంతో కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

‘క్రీడలతో మానసికోల్లాసం’


కుందుర్పిలో క్రీడా పోటీల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు

ఉరవకొండ,నవంబరు29(ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసికోల్లాసం లభిస్తుందని ఎంపీడీవో రవిప్రసాద్ అన్నారు. నియోజకవర్గంలోని ఉరవకొండ, వజ్రకరూరులో శనివారం ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి ఉపాధ్యాయపోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారు డివిజన్‌స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఎంఈవోలు ఈశ్వరయ్య, ఎర్రిస్వామి పాల్గొన్నారు.

బొమ్మనహాళ్(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉద్దేహాళ్ గ్రామ జడ్పీ పాఠశాల మైదానంలో శనివారం ఉపాధ్యాయులకు క్రీడాపోటీలు నిర్వహించారు. వాలీబాల్, క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఎంపీడీఓ విజయభాస్కర్, ఎస్ఐ నబీరసూల్ పోటీలు ప్రారంభించారు. ఎంఈఓలు వీరన్న, మల్లికార్జున, నాయకులు నవీన్, సంగప్ప, సైకిల్‌షాప్ హనుమంతు, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

బెళుగుప్ప(ఆంధ్రజ్యోతి): మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదపడతాయని గుత్తి డివిజనల్ విద్యాశాఖాధికారి మల్లారెడ్డి అన్నారు. మండలంలోని ఉపాధ్యాయులకు ఎర్రగుడిలో శనివారం నిర్వహించిన క్రీడా పోటీలను టీడీపీ జిల్లా కార్యదర్శి మల్లికార్జున, హరికృష్ణలతో కలిసి ఆయన ప్రారంభించారు. పురుషులకు క్రికెట్ ఉపాధ్యాయులకు త్రోబాల్ పోటీలు నిర్వహించారు. హెచ్ఎం వెంకటప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.

కుందుర్పి(ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం ఉపాధ్యాయులకు మండల స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించారు. మండల విద్యాశాఖ అధికారులు లక్ష్మీదేవి, తిప్పేస్వామి, ప్రధానోపాధ్యాయులు గోపీచంద్, ఉపాధ్యాయులు క్రిష్ణమూర్తి, మండల కోఆర్డినేటర్ వీరేష్, పోటీలను ప్రారంభించారు. కుందుర్పి, అపిలేపల్లి, బెస్తరపల్లి, ఎనుములదొడ్డి పాఠశాలల జట్లు పాల్గొన్నాయి. బెస్తరపల్లి, ఎనుములదొడ్డి జట్లు ఫైనల్‌కు చేరుకోగా వ్యాయామ ఉపాధ్యాయులు పరమేశ్వర నాయకత్వంలోని ఎనుములదొడ్డి జట్టు విజయం సాధించి విన్నర్స్‌గా నిలిచింది.

కణేకల్లు(ఆంధ్రజ్యోతి): మండలంలో ఉపాధ్యాయ క్రీడా పోటీలను నిర్వహించేందుకు శనివారం ఎంపిక కార్యక్రమాన్ని నిర్వహించారు. పురుష ఉపాధ్యాయులకు క్రికెట్‌లోనూ, మహిళా ఉపాధ్యాయులకు త్రోబాల్ ఎంపికను నిర్వహించినట్లు ఎంఈఓలు లక్ష్మణ, భవానీశంకర్‌లు తెలిపారు. ప్రధానోపాధ్యాయులు వేణుగోపాల్, రహనాబేగం, శ్రీనివాసప్రసాద్ పాల్గొన్నారు.

గుంతకల్లుటౌన్(ఆంధ్రజ్యోతి): గుంతకల్లు డివిజన్‌స్థాయి జట్టును ఎన్నుకున్నారు. స్థానిక ఎస్‌జేపీ ఉన్నత పాఠశాలలో శనివారం మండలస్థాయి మహిళా ఉపాధ్యాయులకు త్రోబాల్ పోటీలను నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన 14మందిని డివిజన్‌స్థాయికి ఎంపిక చేశారు. ఎంఈఓలు మస్తాన్‌రావు, సుబ్బరాయుడు, హెచ్ఎం మురళీకృష్ణ, ఎస్‌జీఎఫ్ కోఆర్డినేటర్ సత్యనారాయణ, పీఈటీలు పాల్గొన్నారు.

డీ.హీరేహాళ్(ఆంధ్రజ్యోతి): క్రీడలతోనే మానసిక ఉత్తేజం కలుగుతుందని మార్కెట్‌యార్డ్ చైర్మన్ హనుమంతరెడ్డి అన్నారు. మండల వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులతో క్రీడాపోటీలను సోమలాపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఎంఈఓ నరోవర్‌బాషా, ఎంపీటీసీ మొండి మల్లికార్జున, రాజశేఖర్, శంకర్, భీమలింగ, బసవరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

శవ రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్ వైసీపీ

● ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

కళ్యాణదుర్గం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): శవ రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్‌గా వైసీపీ మారిపోయిందని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు విమర్శించారు. శనివారం పట్టణంలోని ప్రజావేదిక వద్ద నియోజకవర్గం నుంచి భారీసంఖ్యలో ప్రజలు వివిధ సమస్యలను విన్నవించేందుకు తరలిరావడంతో వారి నుంచి అర్జీలను ఎమ్మెల్యే స్వీకరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కళ్యాణదుర్గం మున్సిపాలిటీతో పాటు నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. అది చూసి వైసీపీ నాయకులకు మతిభ్రమించి లేనిపోని విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో కళ్యాణదుర్గం నియోజకవర్గ పరిస్థితి ఏవిధంగా వుంది, కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఎలా వుందనే విషయాన్ని వారు ఆత్మపరిశీలన చేసుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వానికి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. ప్రజావేదికలో వచ్చిన ప్రజా సమస్యలను ప్రజల సమక్షంలోనే తెలుసుకుని అక్కడికక్కడే ఆయా శాఖల అధికారులకు తెలియజేస్తూ వాటిని పరిష్కరిస్తున్నారు. ఇటీవల శెట్టూరు మండలం మంగంపల్లికి చెందిన షేక్ కరీమ్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆయన భార్య షంషాద్‌కు రూ25 వేలు ఆర్థిక సాయం అందించారు. పట్టణంలోని టీడీపీ నాయకులు పురుషోత్తమ్ ఆకస్మికంగా మృతి చెందడంతో కుమారుడు, కుమార్తె చదువుకు అయ్యే ఖర్చులను తానే భరిస్తానని అభయమిచ్చారు.

నారాయణపల్లిని సందర్శించిన సోషల్‌ఆడిట్ అధికారులు

పుట్లూరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని నారాయణపల్లి గ్రామాన్ని శనివారం సోషల్ ఆడిట్ రాష్ట్ర డైరెక్టర్ శ్రీకాంత్, ప్రోగ్రాం మేనేజర్ సునీల్‌కుమార్ సందర్శించారు. గ్రామస్థులతో సమావేశం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ మూడునెలలక్రితం పంచాయతీలో సోషల్ ఆడిట్ టీం, ఇతర అధికారులు పలు అంశాలను పరిశీలించారన్నారు. చర్చించిన అంశాల్లో పురోగతి ఏమైనా సాధించారా అన్న కోణంలో విచారణకు వచ్చామన్నారు. ఏపీడీ పుల్లారెడ్డి, ఏపీఓ తులసీప్రసాద్ పాల్గొన్నారు.

ఇన్‌ఫ్లో 2580 క్యూసెక్కులు

బెళుగుప్ప, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయరుకు ఇన్‌ఫ్లో 2580, ఔట్‌ఫ్లో 2580 క్యూసెక్కులు ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు శనివారం తెలిపారు. ప్రస్తుతం రిజర్వాయరులో 1.718 టీఎంసీల నీరు వుందని, ఇక్కడి నుంచి ఫేజ్-2కు 1896 క్యూసెక్కులు నీరు వెళుతున్నట్లు తెలిపారు.

ఆక్రమణలపై మళ్లీ సర్వే

కళ్యాణదుర్గం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఆక్రమణలపై అధికారులు మరోసారి సర్వేకు దిగారు. శనివారం పట్టణంలోని కంబదూరు రహదారిలోని రింగ్ రోడ్డును అధికారులు బృందంగా ఏర్పడి సర్వే చేశారు. తహసీల్దార్ భాస్కర్, మున్సిపల్ కమీషనర్ వంశీకృష్ణ భార్గవ్‌ఆర్‌అండ్‌బీ అధికారులు, ఆర్ఐలు, సర్వేయర్లు బృందంగా ఏర్పడి ఈ నాలుగు కూడళ్లలోని సర్వే రాళ్లను గుర్తించారు. మొదట ఈ సరిహద్దు రాళ్లను గుర్తించి ఎక్కడెక్కడ ఎంతమేర ఆక్రమణలకు గురైందో సర్వే చేసేపనిలో నిమగ్నమయ్యారు. దీంతో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకున్న ఆక్ర మణదారుల్లో టెన్షన్ మొదలైంది. ఆక్రమణలను పూర్తిస్థాయిలో నిగ్గుతేల్చే వరకు సర్వేలు యథావిధిగా కొనసాగుతాయన్నారు.

కాంగ్రెస్‌పార్టీ అభివృద్ధిపై సమీక్ష

తాడిపత్రి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ నిర్మాణ కార్యక్రమంలో భాగంగా పార్టీ అభివృద్ధిపై శనివారం ఏఐసీసీ పరిశీలకులు పరమేశ్‌నాయక్, పీసీసీ పరిశీలకులు అలీఖాన్, అల్లాబకాష్ సమీక్షా సమావేశం నిర్వహించారు. పట్టణంలోని కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జి సూర్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ పార్టీని బలోపేతంచేయడానికి కార్యకర్తలతో, నాయకులతో సమావేశంపై చర్చిస్తామన్నారు. డీసీసీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యాలను పెంచుకోవాలి

గుత్తి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా తమ నైపుణ్యాలను పెంచుకోవాలని ఐసీటీ అకాడమీ అధికారి ప్రవీణ్, గేట్స్ కళాశాల ఎండీ రఘునాథ్ రెడ్డి సూచించారు. పట్టణ శివారులోని గేట్స్ కళాశాలలో శనివారం పాలిటెక్నిక్ విద్యార్థులకు ఐబీఎం, బిల్డ్, క్లౌడ్ ట్రైనింగ్ కార్యక్రమాన్ని ఐసీటీ అకాడమీ ఆధ్వర్యంలో నాలుగు రోజుల పాటు నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ శ్రీవాణి, ప్రిన్సిపాల్ సుధాకర్, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ శివారెడ్డి, ఏఓ ఇంతియాజ్ బాషా, ప్లేస్‌మెంట్ అధికారి తన్వీర్ పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్ర అభివృద్ధి

యాడికి, నవంబరు29(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతో రాష్ట్ర అభివృద్ధి పరుగులు తీస్తోందని ఏపీఐఐసీ డైరెక్టర్ చల్లా లక్ష్మీప్రసాద్ అన్నారు. శనివారం మండలంలోని రాయలచెరువులో టీడీపీ నాయకులతో ఆయన సమావేశమయ్యారు. గత ఎన్నికల్లో ఏయే బూత్‌ల్లో టీడీపీ బలహీనంగా ఉంది, అందుకు కారణాలను ఆరాతీశారు. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో టీడీపీ మరింత బలోపేతానికి కృషిచేయాలన్నారు. టీడీపీ మండల కన్వీనర్ దడియాల ఆదినారాయణ, మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ పరిమి శ్రీహరి, మాదాల అనిల్, గోపాల్, రంగస్వామి, గోపాల్‌నాయుడు, రవి, మహేష్ పాల్గొన్నారు.

ఉద్యోగం సాధించాలనే లక్ష్యం పెట్టుకోవాలి

గుంతకల్లుటౌన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువు పూర్తవగానే ఉద్యోగం సాధించాలనే లక్ష్యాన్ని పెట్టుకోవాలని శ్రీ శంకరానందగిరి స్వామి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె. వెంకటేశ్వర్లు సూచించారు. స్థానిక కళాశాలలో ప్రముఖ బహుళ జాతి కంపెనీ ఇన్ఫోసిస్ ఫౌండేషన్, ఐసీటీ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు నిర్వహించిన 15రోజులు నైపుణ్య శిక్షణ తగతలు శనివారం ముగిశాయి. ఇన్ఫోసిస్ ఫౌండేషన్ శిక్షకులు డాక్టర్ బోధిసత్వకందూ, ఐసీటీ అకాడమీ నోడల్ ఆఫీసర్ కురుపాటి రాకేష్, మెంటర్స్ శ్రావణి, షైమూన్, అధ్యాపకులు క్రిష్ణయ్య, నాగార్జున పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

గుంతకల్లుటౌన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని కర్నూలు హెచ్ఎన్ఎస్ స్పెషల్ కలెక్టర్ కె. అనురాధ విద్యార్థులకు సూచించారు. స్థానిక ఎస్కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ఫ్రెషర్స్ డే నిర్వహించారు. కళాశాలలోని ఆర్టీటీ ఆడిటోరియంలో ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మయ్య అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా అనురాధ, టీడీపీ ఇన్‌చార్జి గుమ్మనూరు నారాయణస్వామి, న్యాయవాది కృష్ణారెడ్డి హాజరయ్యారు. టీడీపీ కార్యనిర్వహక కార్యదర్శి రామ్మోహన్ చౌదరి, సింగిల్ విండో అధ్యక్షుడు తలారి మస్తానప్ప, పురుషోత్తం, హెచ్ఎం మాధవరావు, వైస్ ప్రిన్సిపాల్ రవిశంకర్ శర్మ, అధ్యాపకులు జమీలాబీబీ, వాణిశ్రీ, పాల్గొన్నారు.

20 వాహనాలకు నోటీసులు

రాయదుర్గంరూరల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ఉన్న ప్రైవేట్ స్కూల్‌బస్సు వాహనాలను తనిఖీ చేసినట్లు ఎంవీఐ విశ్వనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం 34 వాహనాలు తనిఖీ చేశామన్నారు. అందులో విద్యార్థుల భద్రత, అగ్నిమాపక పరికరాలు ఇంజన్ పనివిధానం, స్పీడ్ గవర్నెన్స్, కండిషన్, రిజిస్ట్రేషన్ తనిఖీ చేసి 20 వాహనాలకు నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు.

శతవసంతాల వేడుకను జయప్రదం చేయండి

తాడిపత్రి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): అనంతపురంలోని లలితకళాపరిషత్‌లో 10న నిర్వహించే సీపీఐ శతవసంతాల వేడుకను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి నారాయణస్వామి పిలుపునిచ్చారు. పట్టణంలోని మాంగల్య ఫంక్షన్‌హాలులో శనివారం నిర్వహించిన సాధారణ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలపై వంద సంవత్సరాలుగా కమ్యూనిస్టులు ఎన్నో పోరాటాలు చేస్తున్నారన్నారు. కార్యదర్శి రంగయ్య, పట్టణ కార్యదర్శి చిరంజీవియాదవ్ పాల్గొన్నారు.